ప్రబుద్ధాంధ్ర

కళాభివర్ధనీపరిషత్తుపక్షమున ప్రకటింపబడు మాసపత్రిక

సంపాదకుడు :— శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి

సంపుటము ౫ } రాజమహేంద్రవరము నవంబరు ౧౯౩౮ { సంచిక ౧౧

ఇలాంటి తవ్వాయి వచ్చినట్టయితే.........?

సుబ్రహ్మణ్యశాస్త్రి—సంపాదకుడు

"పక్కనే అంత గట్టుండగా యేం పని సాయిబూ అదీ? నిక్షేపం లాంటి చెర్లోనే పుక్కిలించి వుమ్మేసుకోవాలా? మీకు మాత్రం యెంగిలి తప్పు కాదూ? కాండ్రించి కూడా—చెప్పిన కొద్దీ మరీని. పోనీ, నీ యిష్టం వచ్చినట్టు చేసుకో. ఎవళ్లెంత చేసుకుంటే అంతా వాళ్లే అనుభవిస్తారు. నాకేం?"

"నీకీ బుద్ధీ వుందీ లేదూ షోమ్ యాజుల్? నూక్కు ఘునూక్కు షీదీ షీదీ, చెర్వూ హంతా గరీబ్ చేషీ, హింకా మాకీ హోచ్ఛేపన్ చేష్తావ్, భాన్‌సూ"

రామప్పసోమయాజులు మరి మాట్లాడలేకపోయాడు. "బుద్ధి గడ్డి తినడంవల్ల నిన్ను పలకరించా"నని మనస్సులోనే పశ్చాత్తాపపడ్డాడు. "అంతటితో చాలించి యిక వెళ్ళిపో మహాప్రభూ" అని కళ్లతో ప్రార్థించాడు.

ఎలాంటి కళని వున్నాడో సాయిబు కూడా యిక మాట్లాడలేదు; కాని అతను వోడ్డెక్కుతూండగా యాజులు పెద్దకూతురు యెత్తేత్తి కాళ్లేసుకుంటూ యెదురు వచ్చి, మొగం చిట్లించుకుంటూ వొక వోరకి తప్పుకుంది. కానైతే సాయిబు కూడా వొక పక్కగానే వున్నాడు. అక్కణ్ణుంచి కదలడం కూడా అతని కిష్టం లేదు. అయితే ఆమె వాలకం చూడగా అతనికి కొంచెం కోపం వచ్చింది. మొదట మొగం అయిమూలగా వంచి, మాతి బిగించుకు తీక్ష్ణంగా చూశాడు. తరవాత లోపల్లోపల యేమిటో గొణుక్కున్నాడు. చివరికి "బ్రామ్మన్ సైతాన్కి గడ్డీ యేస్తాం మాకీ" అని తుబుకూతుబుకూ పావంచాల మీద కూడా వుమ్మేస్తూ గబగబా చక్కాపోయాడు.

"ఎవర్ని నాన్నా సాయిబు తిడుతున్నాడూ?"

"ఇంకెవర్నీ? ఎవళ్లు కేనా బ్రహ్మిగాళ్ళే కదా లోకువ? కానీ—తిట్టుకోనీ—ఈశ్వరుడు లేడూ?"

"అస లెందుకు వచ్చిందీ?"

"కాండ్రించి చెర్లో వుమ్మేస్తావా?" అన్నాను. అదీ అపరాధం. ఇక వొక టేమిటి, నానా మాటలూ—హారోం హర......"

యాజులు వొక్క మునుగు మునిగి, పిలక జాడించుకుని, ఆచమానం చేస్తూ యాదాలాభంగా పక్కకి చూడగా, కుండలు కొందరూ, బిందెలు కొందరూ పుచ్చుకుని, పాతికమంది మాదిగ స్త్రీలు

యెడమ వేపు గట్టు పొడూగునా వరసాగ్గా నుంచుని వున్నారు.

అసలే యాజులికి బహు చిరాకుగా వుంది. ఆపైన యెండెక్కిపోవడం దానిమీద వైశాఖమాసపు కారెండ నెత్తి మాడ్చేస్తూ వుండడం. పైపెచ్చు యిదీ.

అది చూశాటప్పటికి యాజులికి ఫెడీ మనీ వొక్క మెరుపు దెబ్బ తగిలినట్టయింది. తానెక్కడ వున్నదీ, యేం చేస్తూ వున్నదీ, యేం జరుగుతూ వున్నదీ అతని కేమీ బోధపడలేదు. పైగా యెవరో కాళ్లకింద మంటలు పెడుతూ వున్నట్టు వొళ్లు రణకంపర మెత్తిపోయింది. దాంతో అతను నిప్పులు తొక్కిన కోతి లాగ యెగి రెగిరిపడుతూ వొక్క పొలికేక పెట్టాడు.

కాని వాళ్లక్కణ్ణుంచి కదల్లేదు. ఆపెడ బొబ్బ కూడా వినిపించుకోలేదు.

"పోరేం?......మాదిగ పీనుగుల్లారా!.. పోతారా పోరా?"

"మంచినీళ్లకి వచ్చామండి"

"మీ చెరువేమయిపోయిందీ?"

"కుష్టురోగపు అచ్చిగాడు దాల్లో పడి చచ్చిపోయాడండి"

"అయితే మాత్రం......"

"ఆనీ ళ్ళెలా తాగమండి దొరగారూ?"

"కల్లుకంటే చెడిపోయాయా?"

"........................"

"పొండి పొండి, మున్సబు కరణాలకి తెలిస్తే పాతేస్తారు మిమ్మల్ని...తొరగా—యింకా నుంచుంటారేం?"

"నీళ్ళు ముంచుకోకుండా వెళ్లి యేం చెయ్యమంటా రండి బాబయ్యా?"

"చెర్లో దిగారంటే మహామ్మాయి వండించేస్తాను మిమ్మల్ని, వెనక్కి మళ్ళరేం?"

"మేం దూరంగా పోతాం, మా కుండల్లో నీళ్ళు పోసి వెళ్ళిపోండి కామందులు"

"అలాగేం? అబ్బో! ఎంత మదిరిందీ మీకు పొగరూ?......పోతారా వొడ్డెక్కనా?"

"మాటకి మాట యెలా అందిస్తున్నారో చూశావా? స్నానం కూడా చేశావు నువ్వు వాళ్లతో మాట్టాడకు నాన్నా! అదిగో రామినీడుగారి అబ్బులు కామోసు బిందె పట్టుకు వస్తున్నాడు వాళ్లకి నీళ్లు పొయ్యడానికి. అతను వాళ్ల కుండల్లో పోశాటప్పుడు కొన్ని నీళ్లు కింద పడి చెర్లోకి దారి తీస్తాయి, నువ్వు తొరగా తెముల్చుకో"

ఈ మాట చెవిని పడేటప్పటికి యాజులికి కరిగిన సీసం కాళ్లకిందికి పాకి వచ్చినట్టయింది.

ఇక వొక జంధ్యాలు తోముకోడం లేదు. వొళ్లు తోముకోడం అసలే లేదు, సంకల్ప మేనా ప్రారంభం కాలేదు, చివరికి తడి బట్టైనా విప్పేసుకోలేదు; పక్కా గంట పట్టే స్నానం మూడు నిమిషాల్లో తేల్చుకుని, గభీమని వొడ్డెక్కి, పెద్ద పెద్ద అంగలు వేసుకుంటూ—దూకుతూ యింటికి వెళ్లిపోయాడు యాజులు.

"నిక్షేపం—గంగాళం లాంటి చెరువు తగులడిపోతుంది కామోసు. దిక్కుమాలిన కర్మం కాలవలు కూడా కట్టేశారేం గతి యింకా?" అని సాగతీసుకుంటూ ఆమె కూడా అతని వెనక్కాలే యెగిరిపోయింది.

౨

ఎన్ని తరాలనుంచో, మాదిగల కొక చిన్నదీ, తక్కిన అన్ని కులాలవారికీ వొక పెద్దదీ, అవూళ్లో రెండు చెరువు లొక దానితో వొకటి కలిసే వున్నాయి. పెద్ద చెరువులో వున్న నిలవ నీరు పోవా లంటే చిన్న చెరువే దారి. చిన్న చెరువులోకి కొత్త నీరు రావా లంటే పెద్ద చెరువే దారి. ఇలాగ ఆరెండింటికీ ఆదికాలంనుంచీ యెడతెగని

సంబంధం వుంది. పైగా వాటిని రెండింటినీ కలిపే తూము తరుచు తెరిచే వుంటుంది. ఆతూము దగ్గిరిగా మాదిగ లప్పుడప్పుడు మావులు కట్టుకోవడం కూడా వుంటూనే వుంటుంది,

ఆవూళ్లో అరవై యిళ్ల బ్రాహ్మ లున్నారు. మున్సబూ కరణమూ కూడా అక్కడ బ్రాహ్మలే. రయితాంగం—కమ్మవారు పాతిక యిళ్లవారున్నారు; కాని అట్టే మోతుబర్లు కారు. పాటకపుజనం కూడా చాలా కొద్దే అయితే మాదిగిపిల్లిలో మాత్రం యాభై అరవై కొంప లున్నాయి.

అది యెప్పు డెలా తటస్థించిందో కాని, ఆవూళ్లో ముప్ఫయి తొమ్మిది దిళ్ల తురకలు కూడా వున్నారు. వారిలో చాలామంది బీదలే: గాభి తోళ్లవరకు లొక రిద్దరు సంపన్నులే వున్నారు. చిన్న మసీదు— కమ్మవీధి నానుకునే వుంది.

పదేళ్లకిందట మిషనరీలు వచ్చి మాదిగిపిల్లిలో వొక పాఠశాల తెరిచేశారు. ఏడెనిమిది కుటుంబాల మాదిగల్ని మతంలో కూడా కలిపారు. అయిదారుగురు మొగపిల్లలు ప్రయిమరీలో తేలార్చు. పాఠశాలలో పాతికమంది పిల్లల పేర్లున్నాయి. పది పదిహేను క్రాపింగులు వెలిశాయి. అంతే. మాదిగలతో పాటు కిరస్తానీ పంతులు కూడా అక్కడే—అలాగే కాపరం వున్నాడు. కాని మొత్తానికి మిషనరీలవల్ల మాదిగలకి వూళ్లో కొత్త పరపతి యేమీ కలగలేదు. మతంలో కలిసినవాళ్లినా మామూలు వృత్తుల్లోనే వున్నారు.

సంవత్సరం కిందట బదిలీ అయి వచ్చిన కిరస్తానీ పంతులు మాత్రం కొంచెం ఘటకుడు

*　　*　　*　　*　　*

పోలీసులు శవాన్ని దహనం చెయ్యడానికి సెలవిచ్చి వెళ్లిపోయారు.

*　　*　　*　　*　　*

అతికష్టం మీద రెండు రోజు లెలాగో గడిచిపోయాయి. కిరస్తానీపంతులు గాంధిగారి మాట చెప్పి మాదిగపిల్లిలో కొంచెం పు రెక్కించాడు.

ఆవేళ సాయంత్రం నాలుగు గంటలవేళ పెద్ద మాదిగ లిద్దరు కిరస్తానీ పంతుల్ని వెంటపెట్టుకు వచ్చి నడివీధిలో కూమని వున్న మున్సబుకరణాలనీ, బ్రాహ్మణప్రముఖుల్నీ, కమ్మదొరల్నీ సంబోధించి "మా మాట యేం చెప్పా రండి" అని అడిగారు.

"మాట్లాడ రేమండి కామందులు?"

"ఈరెండు రోజుల్నుంచీ యేం చేస్తున్నారురా ? "

"వో పూట వొకరూ, యింకోపూట యింకోరూ కమ్మదొరలు పోస్తున్నా రండి గట్టుమీద మా కుండల్లో నీళ్లు"

"ఇక ముందుకూడా—కొలవలు తెరిచి, చెరువుల్లో కొత్తనీరు పెట్టుకుని దాకా అలాగే కాలక్షేపం చెయ్యండి" -

"చెయ్యలే మండి"

"ఏం చేస్తారు మరి?"

"చెరువులో దిగి నీళ్లు ముంచుకోడానికి మాకు సెలవిప్పించండి"

అందరూ గతుక్కు మని వొకరికేసి వొకరు చూసుకున్నారు.

"ఇదంతా ఆకిరస్తానీ పంతులు చేస్తున్నాడు" అన్నాడు వొక కమ్మదొర తల వూపుతూ, మెల్లిగా. మాదిగపిల్లిలో కిరస్తానీలు ప్రవేశించాక మాదిగలు చెప్పిన మాట వినడం మానేశా రని కమ్మవారికి కొంచెం గుర్రుగా వుంది.

"ఇప్పుడు మనం కొంచెం బిగించామంటే యీ కిరస్తానీలను వెళ్లకొట్టించెయ్యవచ్చు చులాగ్గా" అన్నాడు యాజులు కళ్లెగరవేసుకుంటూనూ ఆచౌదరితోటి. అందరూ కొద్దిగానో గొప్పగానో తలలు వూపారు.

కిరస్తానీపంతులు వారి ముఖలక్షణాలను బట్టి సంగతులు గ్రహిస్తూ యెత్తులు వేస్తున్నాడు.

"వల్లకాదు. మీ తండ్రులనాడు—మీ తాతల

నాడు—మీ ముత్తాతలనాడు—ఎప్పుడేనా యెరుగుదురా మీరు ఆవాజిబీ?"

కళ్లెర్రజేసి వురుముతూ యిలా అడిగాడు కరణం.

"లేకపోతే మా చెరువులోకి నిండా నీరు విడిచిపెట్టించండి"

"అదీ వల్లకాదూ. వున్న కసింత నీరూ మీకిచ్చేసి మేము మట్టి తాగమా?!"

"మరి మా మాటో దొరగారూ?"

"ఆమాట దేవుడి కొడుకు నడగండి"

మున్సబు చటుక్కున యిలా అనేశాడు; కాని వెంటనే నాలిక కరుచుకున్నాడు. అది చూసి కొందరు "ఫరవాలే" దన్నారు. కొందరు "మాటలు విడిచిపెట్టకండి" అన్నారు.

అప్పుడొక చౌదరి అందుకున్నాడు.

"ఎవరికీ యిబ్బంది లేకుండా కాలం వెళ్లిపోవాలంటే యిదివరకి నడిచిందే పద్ధతి. అయితే, అస్తమానూ మీ కందరికీ నీళ్లు పోస్తూ కూచోడానికి యెవరికి సాగుతుందీ? కనక మా వాళ్లలో యెవర్నైనా రాయితీగా కుదురుస్తాను జీతం మీరిచ్చుకోండి"

"దేవుడిచ్చిన నీరు మీరంతా వూరికే వాడుకుంటూ వుండగా డబ్బిచ్చి మేము కొనుక్కోవాలా అండీ?"

"చచ్చినట్టు, లేకపోతే యేం చేస్తారూ?"

"బాగా ఆలోచించండి కామందులు"

"ఆలోచించే చెప్పాం. కాకపోయినా యిందులో ఆలోచించవలసిం దేమీ లేదు"

"మేము లేకపోతే మీ కొక్క రోజు గడవదు. మా కష్టసుఖాలికి మీరే పూచీ. బాగా పరకాయించుకోండి బాబయ్యా"

"ఇప్పటిమట్టుకు మీ కొంపల్లో వొక చెలమ తీసుకోండిరా"

పొరకాల వున్న వొక శాస్త్రులు యిలా అనగా "అవు నవును, ఫాదిరీదొరలు నుయ్యి కట్టించిపెట్ట రాదూ మీకూ? వూరికే మతంలో కలుపుకోగానే తీరిందా" అన్నాడు చౌదరి.

"ఎక్కణ్ణుంచో వచ్చిన ఫాదిరీలు మమ్మల్ని చూస్తారా బాబయ్యా?"

"అయితే యెన్ని తరాలనుంచో వున్న మతం యెందుకు వొదిలిపెట్టారు మీరూ?"

ఈమాట మీద "అలా నిలవతీసి అడగం" డని వొకడూ, "ఇస్కూలు నేలమట్టం చెయ్యాలంటే యిదే సమయం" అని మరొకడూ, "ముందు క్రాపింగులు గొరిగించెయ్యా" లని యింకొకడూ—తలో మాటా కొంచెం గట్టిగానే అన్నారు.

ఇవన్నీ పంతులు చెవిలో పడ్డాయి. గిర్రున తల తిరిగిపోయిం దతనికి. వెంటనే సరళమైన అతని స్వరానికి కరుకుతనం వచ్చింది.

"ఏమంటారు?"

"మీరే చెప్పండి"

"రాజీ కుదరదు"

"కనపడుతూనే వుంది",

"మన పూచీ వదిలిపోయింది. వారికి వారే రాజీకి వస్తే ఆలోచిద్దాం"

"...................."

"వెళ్లిపోదాం పదండి"

వొక్క క్షణం అయినాక "యేం బాబయ్యా, యేం సెలవూ?" అని వొక పెద్దమాదిగ అడగ్గా, "నాలుగు పూటలు కళ్లు మూసుకుంటే వెళ్లిపోయీ దానికి తగువు పెంచా రేమిట్రా?" అంటూ చౌదరి వెటకారం చేశాడు.

పంతులు వూపిరి బిగపట్టి మాదిగల కేసి దృఢ నిశ్చయంతో చూశాడు. "ఇక యెందు కేనా తయారే" అన్నట్టు తల లూపి "పదండి" అంటూ మాదిగలు దారి తీశారు.

* * * * *

"మనం మన జాగ్రత్త మీద వుండడం మంచిదీ" అని యాజులు చెప్పిన సలహా మీద పెద్ద లందరూ

ఆలోచించి, రాత్రీ పగలూ కూడా సరిహద్దు గట్టు మీద కాపలా వుండడానికి మెరికల్లాంటి యిద్దరు కమ్మ యువకుల్ని జీతానికి పెట్టారు.

3

పంతులు తల చించుకున్నాడు. కాని వుపాయం తోచ్చలేదు. అయితే, పెద్ద చెరువులో దిగి తీరాలన్న పట్టుదల మాత్రం అతని కెంత మాత్రమూ తగ్గలేదు, సరికదా పెనవేసుకుపోతూనే వుంది.

“ప్రయోజనం కలగదు” అని నిశ్చయం చేసుకునే అతను రామచంద్రపురం వెళ్లి యీసంగతులన్నీ హరిజనసంఘాధ్యక్షునితో చెప్పి సాయం చెయ్యమని కోరాడు. దానిమీద “తప్పకుండానూ” అంటూ ప్రారంభించాడు ఆత్యాగమూర్తి “మీ వుద్దేశం చాలా మంచిది. మీ దీక్ష నాకు పారవశ్యం కలిగిస్తోంది హరిజనసోదరుల చిక్కులకు నేను మిక్కిలీ పరితపిస్తున్నాను. కాంగ్రెస్సు దృష్టి అంతా యిప్పుడు హరిజనుల పక్షంగానే వుంది. అయితే—మీరు కొంచెం విశాలభావం తోటీ, విశ్వమానవసౌభ్రాత్రంతోటీ, లోకకల్యాణ దృష్టితోటీ యీసమస్యని సమన్వయించాలని కోరుతున్నాను. ఇది చాలా సందిగ్ధస్థితి. పైగా మీవూరి పరిస్థితులు వేరు. ఇంతకీ: ఇప్పుడు కాంగ్రెస్సు సాంఘికపరిష్కారాన్ని దూరంగా పెట్టమని చెప్పి అసెంబ్లీ యెన్నికలలో వురికింది. మీవూళ్లో డెభ్భయి తొమ్మిది వోట్లున్నాయి. అన్నీ అగ్రజాతులవారిలోనే వున్నాయి. మీ మిప్పుడీస్వల్పవిషయంలో కలగచేసుకున్నామంటే విశ్వవ్యాప్తమైన హిందూస్థానభవితవ్యానికి అపాయం సంభవించగలదు. కనక మీ రిప్పుడీసంకుచిత దృష్టి విడిచిపెట్టి రాట్టం చేపట్టండి. హిందీ నేర్చుకోండి. గ్రామపునర్నిర్మాణానికి బలం కలిగించండి. కాంగ్రెస్సువారిని మీ రంతా కలిసి అసెంబ్లీకి పంపకలిగా రంటే అప్పుడు మీ పని చక్కగా—చూడండీ! ఆంధ్రరాష్ట్రీయకాంగ్రెస్సు కమిటీ అధ్యక్షపదవిని మీ వంటి హరిజనసోదరునికి ఇవ్వాలని నేను ఘోరంగా వాదించబోతున్నాను. మరి దయచెయ్యండి”

పంతులు తుళ్ళిపడ్డాడు. మరి అక్కడ నుంచోలేదు.

* * *   * * *   * * *

రాత్రి యెనిమిది గంట అయింది అప్పుడే భోజనం చేసివచ్చి పంతులు అరుబైట పడక్కుర్చీలో కూచున్నాడు. అంటించిన చుట్ట పూర్తి అయేటప్పటికి మాదిగకుల పెద్దలు నలుగురు వచ్చి చుట్టూ కూచున్నారు.

“అప్పుడే వారం రోజులు గడిచిపోయాయి. దారి తెన్నూ యేమీ కనపడ్డం లేదు. పెద్ద కులాల వారికీ మనకీ తగువు మాత్రం పెరిగిపోయింది”

“నిజమే. ఎప్పటికేనా మనకిదే దారి. వారూ మనమూ యిష్టంగా వున్నంత కాలమూ మనకేమీ లాభం కలుగదు. మనం వారి చుట్టూ—మా బతుకు మీ దయాధర్మబిచ్చాలమీదే వుందని మనం దేవుళ్ళాడినంత కాలమూ మన చిక్కులూ, ఇబ్బందులూ వారికి బోధపడవు. “వీళ్ళని చెండనాడుకుంటే మన పని బండిసున్నా అవుతుం”దని వారికి కష్ట తోచేటట్టు మనం చెయ్యగలిగినప్పుడే వారు మనల్ని మనుష్యులని భావించి రాజీకి వస్తారు”

“కాలవలు తెరిచారంటే—”

“తరవాత మనకి మన్నే. ఈలోపునే కావాలేమయినానూ. అయినా యింకా యిరవై మూడు రోజులు మనకి గడువుంది. ఏలాను దగ్గిరేనా మరామత్తు పూర్తి కాక అధికార్లు మరో పది రోజులు గడువు పెంచడం కూడా వుంటూ వుంటుంది. కంగారు పడకండి. నేను నౌకరికి సెలవు పెట్టి యీ పనిలోనే మునిగి వుండడం మీరు చూస్తూనే—”

"పోనీ, మనం కట్టు కట్టి వారి పనులు మానేస్తే ?"

"మనమే చెడిపోతాం. మీచేత ఆపని చేయిస్తే నాకు పేరు రావచ్చు. పత్రికలు "వోహోహో" అని పొగడవచ్చు. కాని నెగ్గించుకోలేక మీరు మాడిపోతారు. చివరికి వారి కాళ్ళూ కడుపూ పట్టుకోవలసివస్తుంది"

"......................"

"......................"

"ఏరాత్రో పెద్ద చెరువు నీరు కూడా మురుక్కాలవలోకి కొట్టేస్తే ?"

"......................"

"......................"

"పెద్ద కులం వారిని యుద్ధానికి కవ్వించామన్న మాట"

"రయితులు మనకంటే తక్కువ వున్నారు. కర్ర పుచ్చుకున్నా మంటే బాపనోరు తలుపులు బిగించుకుని—"

"చుట్టుపట్ల వూళ్లు లేవూ ?"

"మాదిగపిల్లులు మాత్రం—అవును లెండి"

"నిదానించండి. మనం పెద్ద చెరువులో దిగి తీరాలి. ఇది తప్పదు. మీ రీ పట్టు మాత్రం విడవకూడదు. మంచి వుపాయం___"

సరిగా యీ సమయంలో "నాకు దొరికిందండోయి !" అంటూ విస్సన్న వగర్చుకుంటూ వచ్చాడు. కులపెద్దలు "పరుగు పరుగున వచ్చాడు. ఆయాసం తీర్చుకోనివ్వండి పాపం" అన్నారు. "మంచినీళ్ళు పుచ్చుకుంటావా ?" అన్నాడు పంతులు. దానికి వద్దని బుర్ర వూపుతూ వగర్చుకుంటూనే "నేను తురకమతం పుచ్చుకుంటా" నన్నాడు విస్సన్న. అది విని కులపెద్దలు "ఛా, ఛా! ఏం పనిరా అదీ ?" అని మూతి విరిచారు; కాని "వుండం" డంటూ పంతులు వొక్క నిట్టూర్పు విడిచాడు.

పంతులుకి నిజంగా చెరువులో దిగి సావకాశంగా స్నానం చేసినంత వుత్సాహం కలిగింది. చాలా నిదానమైన బుద్ధి కలవాడతను. తాను మాల కెంకడుగా వుండేటప్పటికంటే యిప్పటి తన స్థితి అన్ని విధాల బాగానే వుంది. చదువుకి చదువు, వుద్యోగానికి వుద్యోగం, డబ్బుకి డబ్బు, పలుకుబడికి పలుకుబడి, గౌరవానికి గౌరవం—యేమీ లోటు లేదు. కాని మతంలో కలసినా తాను వూళ్లో కాపరం చెయ్యడానికి వల్ల కాదు. చెరువు ముట్టుకోడానికి వీలులేదు. ఇక కిరస్తానిమతంవల్ల మాదిగల కేం లాభమూ ?

బాగా ఆలోచించాడు పంతులు. "తురకమతంలో కలిస్తే స్వేచ్ఛ. ఎవరూ దేనికీ అట్టుకోరు. వూళ్ళో అందరి యిళ్లల్లోకీ వెళ్లవచ్చు తురక లంటే యెవరూ నో రెత్తరు" ఈలాభాలు స్పష్టంగా కనపడ్డాయి అతనికి"

"నీకే తోచిందా?"

"రామచంద్రపురం నుంచి వస్తూ కరీం సాయిబుగారు చెప్పారు"

"అందరూ కలవా లన్నారా?"

"ఇష్టం వున్నవాళ్లు— పెద్ద చెరువులో దిగాలనీ, వూళ్లో అందరి యిళ్ళలోకీ వెళ్ళాలనే ఉశ వున్నవాళ్లందరూ రావచ్చు నన్నారు."

"సెబాస్" అని యెగిరి గంతు వేశాడు పంతులు; కాని కులపెద్దలికి మొదలూ తుదా యేమీ కనపడలేదు.

"నువ్వే మన్నావు ?"

"నా మట్టుకి నేను సిద్ధం అన్నాను"

"మరి నీకు కులం ?"

"కులంకోసం కులం విడిచిపెట్టేస్తాను నేను"

"తక్కినవాళ్లెవళ్లూ కలవకపోతేనో ?"

"వాళ్ల కర్మం"

"................"

"బర్మాలో నేర్చుకున్నాను కనక హిందూస్థాని బా కిదివరకే వచ్చును ఏసు కొండల వాడి మొక్కుంది కనక గడ్డం—చూసుకోండి"

"................"

"నేను గ్రామసాకర్ని కనక కరీం సాయిబుగారి తోటి కరణంగారి యింటోకీ, మున్సిబుగారి యింటోకీ—బాపనోరి యిళ్లన్నీ దూరేస్తాను. రోజూ చెర్లోనే తాన మాడతాను"

"అంతటితో వూరుకో"

ఇలా అంటూ పంతులు వాళ్ల నందర్నీ యిస్కూలు వాల్లోకి తీసుకువెళ్లి రహస్యాలోచన సాగించాడు.

౪

"సలామ్ మహారాజ్!"

"ఏ వూరు—విస్సిగా!"

"అయ్యా! మీకీ యింకా అస్మంటీ మాటా పస్కి రాద్: యిస్సన్న నిన్నటిక్కీ యిస్లామ్ మతంలో కల్సిపోయాడ్. పేరూ సిప్పాం, యిస్మాయిల్ సాబ్! ఆయా మీకీ సలాం చెప్పి వుండాడ్ కన్కా మీకీ మళ్లీ బదుల్ సలామ్ చెప్పాలా అండీ"

"ఏమిటీ, యేమిటీ!" అంటూ కరణం పడక్కుర్చీలోనుంచి లేవబోయాడు; కాని సాగింది కాదు. ఆమాట వినడం తోటే నడుము విరిగిపోయిం దతగాడికి. అయితే, వెంటనే రెండు చేతులతోటీ కళ్లు మూసుకుని లోపల్లోపలే "రామా, రామా" అనుకుంటూ అలాగే వుండిపోయాడు.

కరణం స్థితి యిలా వుండగా, సరిగా యీ సమయంలోనే ఇన్కంటాక్సు నోటీసు చేత్తో పుచ్చుకుని "నిద్రా యేమిషోయ్?" అంటూ రామప్ప సోమయాజులు వచ్చాడు. కరీమునీ, ఇస్మాయిల్నీ సింగుమ్మంలో నుంచే చూశా డతను; కాని యిద్దరికీ గడ్డా లుండడంవల్ల యిద్దరూ తురకలే అయి వుంటా రనుకున్నాడు? కాని పరకాయించి చూడ లేదు. దగ్గిరికి వచ్చాకనే అతని కళ్లు కరణంమీదే పడ్డాయి. ఇంతే కాక. అసలతనికి అనుమానపవలసిన అవసరం యేం వచ్చిందీ?

అప్పుడు కరీము వోక కుర్చీ కరణానికి దగ్గిరగా వేసి "కూచోండి మహారాజ్" అని యాజులుతో చెప్పి పక్కకి తిరిగి కన్ను గీటాడు వెంటనే యిస్మాయిలు "సలామ్ యాజుల్ మహారాజ్" అన్నాడు. యాజులు కుర్చీమీద కూచుంటూ, "అభీష్టసిద్ధి—" అని ఆశీర్వచనం చేస్తూ యాదాలాభంగా కన్నెత్తి చూస్తాడు కదా కుడిచెయ్యి అలాగే నొసట వుంచుకొని, చిరునవ్వు నవ్వుతూ, వంగి విస్సిగాడు—

యాజులు వులిక్కిపడ్డాడు. ఆకంగారులో కుర్చీ వెనక్కి పడిపోయింది. కుడిచేతిలో వున్న నోటీసు వోక వేపుకీ ఎడమచేత్తో వున్న పొడుముకాయ వోక వేపుకీ పడిపోగా యాజులు కిల్లకిత్తలా పడి వొక్క క్షణానికి పక్కకి దొర్లి లేచి, తూల్తూ తూల్తూ దూరంగా వెళ్లిపోయి "వోరి మాదిగ పీనుగా" అని యిక మాట్లాడలేకపోయాడు.

ఇదంతా వేళ్ల సందుల్లో నుంచి చూస్తూనే వున్న కరణం యిక లాభం లేదని నిశ్చయించుకుని యెత్తుపడిపోయినవాడిలాగ మెల్లిగా లేచి కూచున్నాడు.

"ఈదురంతం యేమిషోయ్ కరణం?"

"తురకల్లో కలిశాడు విస్సిగాడు—"

"అగ్గో, అగ్గో. అస్మంటీ మాటా—చెప్పనూ లేదూ మహారాజ్? యిస్సన్నా జాంతే నై. యిస్గాడూ మర్గయా అనోక్కండి. యిస్మాయిల్ సాబ్ చెప్పండి. లేకపోతే బడా తంటాల్—హంతా మీకీ యెర్గుదుర్"

"ఏమిషోయ్ యీ ఫుట్టిమునకా!"

"మనకర్మం. ఇంకేం చేస్తామూ? రండి, కూచోండి"

"ఛా, ఛా! తన్ని తగిలెయ్యక వాణింకా—"

"ఖబర్దారీ యాజుల్ సాబ్! మాకీ ముసల్మాన్! హాూ, హిన్దూ మీకీ పప్పూ—"

"కరీం! వూరుకో. వారు పెద్దలు—"

"పెద్దల్కీ, చిన్నల్కీ తేడా వుండ్వాలా. ఘన్నూఘన్నూ మాటల్ సెప్తే—మహారాజ్! మాకీ ఘూరవం కావాలా. మీకీ ఘూరవం చేస్తామ్. బరాబర్"

ఈసందట్లో యాజులు మేఘాల మీద యెగిరి పోయాడు.

కరణం వొక్క క్షణం ఆలోచించాడు, కాని యేటూ పాలుపోలేదు. చివరి కతను "యీ దెయ్యాలు వొదిలిపోతే చాలు" నని నిశ్చయించుకుని "నాకు దొడ్లో పనుంది. మీ రిప్పటికి వెళ్లిపోండి" అని నౌకర్లకి చెబుతూ మాట వినిపించుకోకుండా లేచి చక్కాపోయాడు.

ఇదంతా చూశాటప్పటికి యిస్మాయిలుకి చీకట్లోనుంచి గభీ మని వెలుగులో పడ్డట్టయింది. యుగయుగాలనుంచి వున్న పుట్టుగుడ్డితనం పోయి వున్నట్టుండగా అతినిశిత మైన చూపు వచ్చినట్టయింది. ఇప్పుడే తల్లి కడుపులోనుంచి పుట్టి, పుట్టిన వెంటనే ప్రాజ్ఞత వచ్చినట్టున్నూ అయింది. దీనితో అతనికి బ్రహ్మానందం కలిగింది. చూస్తూ వుండగా కళ్లల్లోనుంచి బాష్పప్రవాహం వురకలు వేసుకుంటూ లంఘించింది. ఇది యిలా వుండగా: మాదిగపిల్లిలో మట్టుకే గడప దాటి లోపలికి వెళ్లగల తనకి అందరి యిళ్లల్లోనూ సంచరించడాని కిలాంటి అధికారం యిచ్చిన యిస్లాము మీద అతని కపార మైన భక్తీ, విశ్వాసమూ కలిగాయి. ఇదంతా కరీము సలహావల్లనే తనకి సంభవించడం కూడా అతనికి జ్ఞాపకం వచ్చింది. వెంటనే అతను కరీం పాదాలమీద పడి "భాయీ! నీ రుణం నేను తీర్చుకోలేను. నే నిదివరకి పురుగుకంటే అన్యాయంగా బతికాను. నేనూ మనిషినే అని తల యెత్తుకుని తిరగ్గల అదృష్టం నా కిప్పటికి కలిగింది. ఇస్లాం మతం రాజామతం. భాయీ! నేను యిస్లాము మతాన్ని నిందించిన వాడి నాలిక పెరికేస్తాను. ఇస్లాము మీద పగబట్టినవాణ్ణి పాతేస్తాను. ఇస్లాం మతం కోసం నేను ప్రాణా లిచ్చేస్తాను" అని యిక మాట్లాడలేకపోయాడు.

దీంతో కరీముకి ముందు గంభీర మైన ఆనందమూ, తరవాత అత్యున్నత మైన గర్వమూ కలిగాయి. అతనికి మహమ్మదువారు వచ్చి తన శిరస్సు మీద చెయ్యి వుంచి దీవించిన ట్టయింది. వెంటనే అతను యిస్మాయిల్ని లేవదీసి, గడ్డం సవరించుకుంటూ యెదురొమ్ము విరుచుకు నిలిచి "యిస్మాయిల్! భాయీ! మతం అంటే యిస్లాం వొక్కటే మతం. మన్సి అంటే ముసల్మాన్ వొక్డూ మన్సి. దేవ్డూ అంటే అల్లా వొక్డూ దేవ్డు. గుర్వూ అంటే మహామద్‌వార్ వొక్రూ గుర్వు. తెల్సిందీ భాయీ! మన్కీ మతంలో మన్సికీ మన్సికీ యెక్వా తక్వా లేవ్. నవాబ్, గులామ్ వొక్టే కంచంలో నాష్టా పడ్తార్. ప్యారీ యిస్మాయిల్! యిదీ వొక్టే యినోకీ. అల్లా కటాక్షం సల్లంగా వుండ్తే ముసల్మానూకీ లుక్సాన్ లేను. ముసల్మానూకీ దుఃఖం లేను. ముసల్మానూకీ బయ్యం లేదు. ముసల్మానూకీ షత్రుల్ లేదు. ముసల్మానూకీ అపాథెం లేదు. నమ్ము భాయీ!" అని అతన్ని కౌగిలించుకుని పరవశుడైపోయాడు.

౫

పదిన్నర అయింది. పావంచాలూ, చెరువూ బ్రాహ్మణముగాళ్లతో నిండిపోయి వున్నాయి. చెంబులు తోమేవాళ్లు కొందరు. బట్ట లుతికేవాళ్లు కొందరు. స్నానం చేసేవాళ్లు కొందరు. కబుర్లు చెప్పేవాళ్లు కొందరు. జాతేహాలు పన్నేవాళ్లు కొందరు. వొకచోట సంభావనల గొడవ. వొకచోట వరకట్నాల బేరం. ఇంకోచోట దొంగ సాక్ష్యాల పన్నాగం. మరోచోట వడ్డీలెక్కలు.

వేరొక చోట మనోవర్తి దావాల ఆలోచనలు. మధ్యమధ్యా, అక్కడక్కడా వేశ్యాప్రశంసలు. సంగీతాలు. చాటుధారపద్యాలు. ప్రాస్తావిక శ్లోకాలు. ఇంగ్లీషు టప్పాలు. అసావాదిత్యో బ్రహ్మలు. అర్ఘ్యప్రదానాలు. గాయత్రీజపాలు. పూతపదాలు. వో! వొక టేమిటి, రేవంతా మహా కోలాహలంగా వుంది.

ఇలాంటి స్థితిలో:

అటు మాదిగిపల్లిలో నుంచి పిన్నలూ, పెద్దలూ — స్త్రీ పురుషులు యెనభై తొంభై మంది బిలబిల్లాడుతూ వచ్చి సరిహద్దు గట్టుమీద వరసలు తీరి కూచున్నారు.

ఇటు తురకపేటలో నుంచి జవాజెట్లలాంటి యువకులు పాతిక ముప్ఫయిమంది లాఠీకర్రలు పుచ్చుకు వచ్చి దక్షిణపు గట్టుమీద మీసాలు దువ్వుకుంటూ, వంకరచూపులు చూసుకుంటూ బారులు తీరి నుంచున్నారు.

బ్రాహ్మలందరూ అదీ యిదీ కూడా చూశారు. అయితే, అదేమిటో, యిదెందుకో యేమీ బోధపడకపోయినా తురకలూ, మాదిగలూ గూడుపుఠాణీ చేస్తున్నారనీ, యిప్పుడేదో వొక సాహస శౌర్యం జరిగిస్తారనీ మాత్రం తట్టింది. వెంటనే అరణగొణధ్వని అంతా చప్పగా చల్లారిపోయింది. పైగా వారందరికీ యెక్కడ లేని చురుకూ వచ్చింది. అష్టోత్తరశతగాయత్రికి సంకల్పించిన వారు అప్పటి కయినంత సంఖ్యతో చాలించి ఆచమానం చేశారు. పూర్తిగా సంధ్యావందనం చెయ్యబూనినవారు అర్ఘ్యప్రదానంతో పూర్తి చేసేశారు. సబ్బు వుపయోగించదలచినవారు వొట్టి చేతులతోనేనా తోముకోకుండా స్నానం ముగించేశారు. కట్టుకున్న బట్టలు వుతుక్కుందా మని నిశ్చయించుకున్నవారు ఆబట్టలు విప్పనేనా విప్పకుండా చెంబులతో నీళ్లు ముంచుకో సాగారు.

ఇలాగ వొక్క నిమిషం గడిచింది. రెండో నిమిషం ప్రారంభం అయింది; కాని అది పూర్తి కాకుండా కరీమూ, యిస్మాయిలూ యేనుగు గున్నలలాగ వచ్చి చివరి పావంచామీద నుంచున్నారు.

కరీము కరీమే. ఇక రెండో మనిషా? కనురెప్పలు రెండుమాట్లు ఆడేటప్పటికి అతను మాదిగి విస్సిగాడని అందరికీ తెలిసిపోయింది. వెంటనే అందరికీ శరీరాలు గరిపొడిచాయి. చెవులు గళ్లుపడ్డాయి. మనస్సులు చెదిరిపోయాయి.

అయితే వారింకా సరిగా తేరుకోకుండానే దక్షిణపు గట్టుమీద నుంచి చెవులు గింగురు మనేటట్టు వొక యీల వినవచ్చింది. అది పూర్తి కావడం తరవాయిగా కరీము యిస్మాయిలు కేసి చూస్తూ "అల్లాహో అక్బర్" అని గొంతెత్తి అన్నాడు. తరవాత యిస్మాయిలు బ్రాహ్మల కేసి చూస్తూ అంత కంటేనూ గట్టిగా "అల్లాహో అక్బర్" అని రెండు చేతులూ పైకెగరవేశాడు.

అంతే. వెంటనే యిద్దరూ గభీ మని గభీ మని బ్రాహ్మల మధ్య వురికారు.

దాంతో అగాధమైన సముద్రంలో పెద్ద కొండలు విరుచుకు పడ్డట్టయింది. చేటలతో కొట్టినట్టు బ్రాహ్మలందరిమీదా నీళ్లు చిందాయి. కొందరికి వూపి రాడక వుక్కిరిబిక్కిరయింది. కొందరు హఠాత్తుగా యెగసిన కెరటాలను తట్టుకోలేక వూగిసలాడారు.

కాని యెవరూ కోప్పడలేదు. "ఏం పని యిదీ?" అనేనా అనలేదు. నోళ్లలోనైనా గొణుక్కోలేదు. దురాయి కట్టినట్టందరూ కిక్కురు మనలేదు. కొందరు కొయ్యయిపోయారు కూడానూ.

బ్రాహ్మ లిలాగ శిలావిగ్రహా లయిపోగా కరీమూ, యిస్మాయిలూ "వొళ్లూ సల్లపడిందీ భాయీ" అంటే, "ప్రాణాలు తేరుకున్నాయి భాయీ" అని వొళ్లు తోముకోవడం మొదలుపెట్టారు.

బ్రాహ్మలకి సముద్రంలో వుందన్న బడబానలం యిప్పుడు ఆచెరువులో ప్రత్యక్షం అయింది. వారిలో వొక్కరూ కూడా యిక క్షణమేనా వుండలేకపోయారు. ఎలా వున్నవారలాగ—యెక్కడున్నవారక్కణ్ణుంచి వొడ్డెక్కి, వెనక్కి తిరిగి చూడకుండా—నింపాదిగా కాదు—వురకలూ పరుగులూ పెడుతూ మాయమైపోయారు.

ఇది చూసి మాదిగ అందరూ దిక్కులు బద్దలాసిపోయే టట్టు చప్పట్లు చరిచారు. తురకయువకులు ఆకాశం చిల్లులు పడిపోయే టట్టు యీలలు వేశారు.

కరీమూ, యిస్మాయిలూ విరగబడి నవ్వారు.

“........................”

?

నిజాము రాజ్యములోని తెనుగువారి స్థితి

సురవరము ప్రతాపరెడ్డిగారు బి. ఏ., బి. ఎల్.

ప్రబుద్ధాంధ్ర సంపాదకులు “నిజాంరాజ్యంలోని తెనుగువారి స్థితి అని రాస్తే చాల సంతోషిస్తాను” అని నాకొక జాబు వ్రాసినారు. వారి కోరిక అనుల్లంఘనీయము. ఏదేని విషయమును గురించి వ్రాయుమనిన నా కొందోళన కలిగి యుండెడిది. వారే వస్తునిర్దేశము చేసి వ్రాసినందున శ్రమ తప్పినది. నాకును నిదే విషయమును గురించి బ్రిటిషిండియాలో నుండు ఆంధ్రసోదరులకు తెలుపుకొనవలెనని బహుకాలమునుండి కోరిక యున్నది. ఏమి గ్రహచారమో యేమో నిజామాంధ్రు లన్న నిజాములో వలెనే బయటను నిరాదరణమే కనిపించుచున్నది. ఇచ్చట లక్షల కొలది యాంధ్రుల కుండు కష్టసుఖములను గురించి కావలసినంతగా వ్రాయువారే లేరు. మహారాష్ట్రుల కుండు నభిమానములో దశాంశము కూడ నాంధ్రులలో లేదనవచ్చును. నిజాము రాష్ట్రములోని హిందువులకు అందు ముఖ్యముగా మహారాష్ట్రులకు కష్టములు కలిగిన బొంబాయి రాష్ట్రపు పత్రిక లేమి, నాయకు లేమి తీవ్రచర్యలు చేయుచుందురు, కాని మన ఆంధ్రసోదరులలో నిట్టివి కొంచుట లేదు. ఏ తాలూకా మూలయందో యే చిన్న సభయో జరిగిన దానికి ముఖ్యస్థాన మిత్తురు కాని అఖిలనిజాము రాష్ట్రాంధ్రులకు సంబంధించిన ప్రథమద్వితీయమహాసభలు (Conferences) జరిగిన వాటికి దగు స్థాన మిచ్చు పత్రిక లేకపోయెను. కావున మా కథ కొంత యైనను నాకు తెలిసినంత మాకు ప్రమాదము లేకుండు నట్లుగా వ్రాయ గలిగినంత బ్రిటిషాంధ్రసోదరులకు తెలుపుకొనిన నిక ముందైనను మమ్ము వలసపోయిన వారినిగా, లేక అనాగరికులనుగా తలపక మాయందు సానుభూతి చూపి మాకే కష్టములు వచ్చినను అవి తమ కష్టములుగా భావించి సర్వవిధముల సాయపడుదు రని యాశతో వ్రాయుచున్నాను.

నిజాము రాష్ట్రముయొక్క మొత్తము వైశాల్యము ౮౨౬౯౮ చదరపు మైళ్లు. దీనిలో ఆంధ్ర ప్రాంతముయొక్క విస్తీర్ణము ౪౧౩౪౧ చదరపు మైళ్లు. (అనగా నిజాము రాష్ట్రములో సగము భాగము). ఈరాష్ట్రములో ౧౬ జిల్లాలు కలవు. అందు తెనుగు జిల్లాలు ౮.

(౧) వరంగల్ (ప్రాచీనపు ఓరుగల్లు)
(౨) కరీంనగరు.
(౩) ఆదిలాబాదు.
(౪) అత్రాపుబల్దా (అనగా "బల్దా" నగరము చుట్టు నుండు భాగము)
(౫) మెదకు.
(౬) నిజామాబాదు (దీనిని పూర్వము "ఇందూరు" అనుచుండిరి)
(౭) మహిబూబునగరు (దీనిని పూర్వము "పాలమూరు" అనుచుండిరి)
(౮) నల్లగొండ

ఇటీవల "బాగాల్" అను జిల్లా ఒకటి ప్రత్యేకముగా విభజింపబడినది. ఇవి గాక కర్ణాటకములో చేరిన రాయచూరు జిల్లాలో నీ క్రింది భాగములు ఆంధ్రులవే.

(౧) అలంపూరు తాలూకా.
(౨) గద్వాలసంస్థానము.

జనసంఖ్య.

ఈరాష్ట్రముయొక్క మొత్తము జనసంఖ్య ౧౪,౪౩౬,౧౪౮

అందు ఆంధ్రులు	౬,౯౭౨.౫౩౪
మహారాష్ట్రులు	౩,౭౮౬,౮౩౮
కర్ణాటకులు	౧,౬౨౦,౦౯౪
ఉర్దు మాతృభాషగా గలవారు	౧,౫౦౭,౨౭౨
మహమ్మదీయులు	౧౫౩౪౬౬౬
ఇతరులు	౫౪౯,౪౧౦

తెలంగానా, అనియు, మరాట్వాడా అనియు నిజాం రాష్ట్రము రెండు భాగములుగా విభజింపబడినది. రెండవదానిలో కర్ణాటకులును చేరియున్నారు.

విద్య—భాష

నిజాము రాష్ట్రములో అక్షరాస్యులు ౫ యేండ్లు ఆంతకు పైబడిన వయస్సు గలవారిలో నూటికి ౫ గురు. కావున నాంధ్రులలోను నిరక్షరాస్యుల సంఖ్య అపారము. దీనికి తోడుగా నిచ్చట ప్రత్యేకపరిస్థితులు కొన్ని ఆంధ్రుల విద్యాభివృద్ధి కాటంకములు కలిగించుచున్నవి. బ్రిటిషిండియా రాజకీయభాష యగు ఇంగ్లీషును మాతృభాష యగు ఆంధ్రమును ఆంధ్రులు నేర్చికొందురు; కాని యచ్చట బహుభాషలలో ప్రవీణత నొందవలసి యున్నది. సార్వభౌమభాష కావునను పాఠశాలలలో పాఠ్యమగునట్టిది గావునను ఇంగ్లీషు తప్పని దయ్యె. ప్రభుత్వభాష కావున ఉర్దూ నిర్బంధ మయ్యె. ఉర్దూలో ప్రావీణ్యత నొందవలెనన్న అరబీ చదువకున్నను ఫార్సీ మాత్రము తప్పక చదువవలసినదే. ఇక అభిమానభాష ఆంధ్రము. అది ఐచ్ఛికము, లాభరహితము. ఎవరు చదువుదురు? కావున ఆంధ్రభాష యచ్చట దినదినము క్షీణించుచున్నది. భాషలో ఉర్దూసాంకర్య ముండుట సహజమే. బ్రిటిషిండియాలో ఇంగ్లీషు కలిసి యెట్లుండునో అదే విధముగా మాభాషలోను ఉర్దూ సమ్మేళనము బాగుగా కలదు. ముఖ్యముగా అపచారము చేయువారు రెడ్లు, వెలమలు, గోలకొండవ్యాపారులు, నియోగులు, మున్నూరుకాపులు. వీరు ఈ రాష్ట్రములో గణనీయులు. అయినను వీరికి ఉర్దూ భాషయే ఉగ్గుపాలతో నేర్చు విద్య. అనేకులకు తెనుగులో మాట్లాడుట కన్న ఉర్దూలో విసరివేయుట చాల సులభము, మరియు గౌరవప్రదమనియు తలతురు.

వేషములు

"స్వస్థానవేషభాషాభిమతా స్సంతో రసప్రలుబ్ధియః" అన్న నన్నయ్యభట్టు వాక్యములు మాయందు నిరర్థకములే. భాషకు తోడు వేషము. బ్రిటిషిండియాలోను (ఇప్పుడు తగ్గుచున్నను) ఇంగ్లీషు వేషములు యువకులలో కలవు. మా రాష్ట్రమందును తురకవేషములు బహుళములు. ఇంగ్లీషు వేషములు వేయువారిని,

"ఏనుగు తోలు దెచ్చి ఏడాది యుతికిన
నలుపు నలుపే కాని తెలుపు కాదు"

అన్నట్లు తమ రంగును మార్చుకొనజాలనందున మన వారే యని పోల్చుకొనగలము. కాని తురకవేషములు వేసిన వారిని హిందువు లని కాని ఆంధ్రులని కాని నిర్ణయించుట కెవ్వరికిని సాధ్యము కాదు. కొందఱు హాజీల వలె మాల్వీల వలెవదలు లాగులను కొందఱప్పుడే పంజాబునుండి దిగివచ్చిన పఠానులవలె బిఱ్ఱు పైజామాలను ధరించి షేర్వానీ తుర్కీటోపీ ధరించి కత్తీ లేని ముసల్మానులవలె నుందురు. ఇంతటితో తృప్తి నొందక. కొందరు (వారు రెడ్లు) గడ్డములు పెంతురు. ఆగడ్డములను గూడ ఇరుపాయలుగా పాపట తీసి దువ్వి పెంచుచుందురు. కొందఱు (వారును రెడ్లే) మహమ్మదీయ తీర్థస్థాన మగు అజమారు (షరీఫ్)కు యాత్రకేగి వత్తురు. రెడ్లలో వెలమలలో రెండు ఉర్దూ ముక్కల డొక్క శుద్ధి యైనవారెల్లను తురకవేషములలో నుందురు. (ఇప్పుడిప్పుడు నూటికి సగమంతు ఈ వేషములు తగ్గిపోయిన వని చెప్పగలను.)

విద్యాభివృద్ధి కాటంకములు

విద్యావిషయము చెప్పుచు వేషములోనికి దిగితిని. విద్యకు ఆటంకములలో నొకటి రాజకీయ భాష యగు ఉర్దూ అని చెప్పితిని. సుమారు ౧౨ సంవత్సరములనుండి ఉస్మానియా విద్యాపీఠము స్థాపిత మైన నాటినుండి ఉర్దూ ప్రధానభాష యగుట జేసి యితరభాషలు మూల బడిపోయినవి. పైగా ౧౩౪౩ ఫసలీలో అనగా ౧౧ ఏండ్ల క్రిందట భాష్ని బడుల శాసనము బయలుదేరెను. దాని మూలమున ప్రభుత్వాజ్ఞ లేనిది ప్రైవేటు బళ్ళు ఎవరును స్థాపించ గూడదు. స్థాపించిన బలవంతముగా మూయింపబడును. ఈ పరిస్థితులను గమనించియే మహారాష్ట్రులు తమ భాషాభివృద్ధికై "వివేకవర్ధని పాఠశాల"ను స్థాపించినారు. ఆంధ్రుల కిట్టిది లేదు. కాని మహారాష్ట్రులే స్థాపించి వదలుకొనిన బాలికా పాఠశాలను ఆంధ్రులేయిప్పుడు నడపుచున్నారు. అందు ఇంగ్లీషు ఆంధ్రము మెట్రికువరకు చదివింతురు. ప్రకృతము ౧౫౦ వరకు బాలికలు చదువుచున్నారు. విద్య యుచితము. కాని ప్రభుత్వము సహాయము సంపూర్ణముగా సున్న. ఎన్ని మారులు మొర పెట్టుకొనినను దమ్మిడీ సహాయము కూడ చేయకుండుట ఆంధ్రుల దురదృష్టమే లేకున్న బ్రిటిషిండియాలోనే కాక విదేశము లందును విద్యకై వేలు కాదు కదా లక్ష లేసేట దానము చేయుచుండిన మా ప్రభుత్వమువారికి స్థానిక విద్యాసంస్థ అందు బాలికల విద్యకై యేర్పడినట్టిదానికి సహాయము చేయు మన్న ససేమిరా అని ముష్కరించుకొని కూర్చుండుట యేల? ఏది యెట్లున్నను ఈ పాఠశాలను పట్టుదలతో ప్రశంసనీయముగా చందాలెత్తి నడిపించుచున్న మాడపాటి హనుమంతరావు ప్రభృతులు ప్రశంసనీయులు.

ప్రజాహిత సంస్థలు.

అంతగా పేర్కొన దగినవి లేవు. ఉన్నవానిలో నిజాంరాష్ట్రాంధ్రజనకేంద్రసంఘము హైద్రాబాదు నగరాంధ్రజనసంఘము ముఖ్య మైనవి. మొదటి దానికి ఆదినుండియు. మాడపాటి హనుమంతరావు గారు కార్యదర్శులు. ఈ సంఘపక్షమున ననేక స్థలములలో గ్రంథాలయాదిసభలు జరుపబడినవి. రెండు మహాసభలు జరిగినవి. సుమారు ౨౦ లఘు పుస్తకములు ముద్రింపబడినవి. ఇక్కడి యాంధ్రుల పరిస్థితుల నెరుగ గోరువారు ఈ ౨౦ గ్రంథములను పై మాడపాటి హనుమంతరావుగారి వద్దనుండి తెప్పించికొని చూచిన విషయగ్రహణ మగును. ఈ రాష్ట్రములో సుమారు వందవరకు ఆంధ్ర గ్రంథాలయములు స్థాపింపబడెను. కాని యందు సగము పైగా అంతరించినవి. (ఇది ఆంధ్రుల కుండు లక్షణమే) మిగత సగములో కొన్ని మిణుకు మిణుకు మనుచున్నవి. దీనికి తోడు ప్రభుత్వము యొక్క అనాదరము. బరోడాలో ప్రజాస్థాపిత

గ్రంథాలయములకు ప్రభుత్వసహాయ ముండగా నరాష్ట్ర గ్రంథాలయములపై పోలీసువా రొక కన్నుంచవలెనని ఆజ్ఞ యున్నది. ఇప్పు డున్న గ్రంథాలయములో దినదినాభివృద్ధి పొందునది క్రీ. శ. ౧౯౦౫ లో స్థాపింపబడిన నగరమందలి శ్రీకృష్ణదేవరాయాంధ్ర గ్రంథాలయము. ఇందు సుమారు ౫౦౦౦ సంస్కృతాంధ్రాది గ్రంథములును అముద్రితతాళపత్ర గ్రంథములును, అముద్రితశాసన ప్రతిబింబములును కలవు.

రెడ్డి హాస్టల్

హైద్రాబాదునగరమును చూడవచ్చు నాంధ్రుడు తప్పక యీహాస్టలును తిలకించి పోవలసినదే. ఇంతటి ప్రచండ మైన ప్రజాహితసంస్థ బ్రిటిషాంధ్ర భాగమందును లేదనవచ్చును. సుమారు మూడు లక్షల విలువ గల భవనములు, సుమారు ౧౨౦౦౦ గ్రంథములు గల భాండాగారము రమారమి ౧౫౦ విద్యార్థులును కల సంస్థ యిది. ఈసంస్థ యేర్పడిన తర్వాతనే రెడ్ల వేషభాషలందు మార్పులు, కలిగిన వన వచ్చును,

ఆచారములు

నిజాము రాష్ట్రములో రైళ్లు తక్కువ. అందు తెలంగాణాలో మరీ తక్కువ. నల్లగొండ, కరీంనగరు, ఆత్రాపుబల్దా, జిల్లాలకు రైలు మార్గమే లేదు. తక్కిన జిల్లాలలకును బాదరాయణిసంబంధముగా జిల్లాలో నొక మూలన పోవుచున్నది. విద్యావ్యాపకము సున్న. అట్టిచో జనులు పూర్వాచారపరాయణులు; మూఢవిశ్వాసములు మెండు. సనాతనులకు పెట్టని కోట. రెడ్లలో వెలమలలో, గోలకొండవ్యాపారులలో జనానా పద్ధతి మెండుగా నున్నది. రెడ్లలో మూడు తెగలు దేశముఖు (దొరల) తెగ మొదటిది. రెండవది పటేండ్ల తెగ (గ్రామమున్సిఫులు) మూడవది కాపులు. ఒకరి కన్న నొకరు హెచ్చని తలతురు. దేశముఖులలో పూర్ణముగా, పటేండ్లలో సంపత్తు ముదిరిన చోట గోషా పద్ధతి కలదు. వెలమలలో ధనికులందే కాక బీదసాదలందునూ సంపూర్ణముగా గోషా కలదు. తురకల కన్న హెచ్చుగా విపరీతపద్ధతులపై నీ "ఘోష" వీరి యందు కలదు. గోలకొండ వ్యాపారులలోను "దేశపాండ్యాలు" (దొరలు) కరణములు అని రెండు శాఖలు. అందు మొదటి శాఖలో గోషా కలదు.

రెడ్లకు గోలకొండ వ్యాపారులకును మతమందు పట్టుదల తక్కువ. ఇస్లాం మత విశ్వాసములు కొందరికి కలవు. ౯-౧౦ ఏండ్ల క్రిందట పెద్దపల్ల జాగీర్దారు లగు రాజేశ్వరరావు జీవించిన కాలములో ముసల్మాను విశ్వాసములు కలిగి చనిపోవునప్పుడు తన శవమును ముసల్మానుల కిచ్చి గోరీ కట్టించుటకై యేర్పాట్లు చేసికొని చనిపోయెను. అతని యధీనములో సుమారు ౨౦౦-౩౦౦ గోలకొండ వ్యాపారి కుటుంబము లుండెను వారిపై వీరి యభిప్రాయములు చలామణి యగుచుండెను.

ఆదిహిందువుల కేలాటి సౌకర్యములు సవర్ణులు కలిగింపనందున అనేకస్థలములలో క్రైస్తవమందును మహమ్మదీయమతమందును వీరు చేరిపోవుచున్నారు. ఈ యుభయమతముల పక్షమునుండి మిషనులు పని చేయుచున్నవి.

ఆంధ్రసంస్థానములు

మా రాష్ట్రములో ముఖ్యమైన యాంధ్రసంస్థానము లివి.

౧ గద్వాల.
౨ వనపర్తి
౩ కొల్లాపురము
౪ అమరచింత
౫ గోపాలుపేట
౬ దోమకొండ
౭ సీర్నపల్లి
౮ సురపురము

ఇవి గాక దొంతి, చింబోడు వంటి చిన్నచిన్న జాగీరులు చాల గలవు. నారాయణపురము అను నొక గొప్ప రెడ్డి సంస్థాన ముండెను. ఆరెడ్డి దొర

వారు లీలావిలాసుడై ముసల్మాను స్త్రీని నికా చేసికొని ఇస్లాం మత స్వీకార మొంది సంతానహీనుడై చనిపోయెను. సంస్థానము ఖాల్సా (జప్తు) అయ్యెను. అయిదారు చిన్న జాగీరులు మాత్ర మతని సంబంధు లైన ముసల్మాను స్త్రీల వశమున నిప్పుడున్నవి.

పై ఎనిమిది సంస్థానములు ఆంధ్రసంస్థానములు. కాని వీనిలో ఖాల్సా యిలాకా (అనగా నేరుగా శ్రీ నిజాంప్రభువు పరిపాలనమం దుండు భాగము) లోవలె సౌకర్యములు తక్కువ. పన్నులు హెచ్చు. విద్య ఖాల్సా కన్న హీనము సంస్థానముఖ్యపట్టణమం దేవో యొకటి రెండు సర్కారీ బళ్లు తప్ప తక్కిన గ్రామములలో సర్కారీ బళ్లు లేనే లేవనిన పొరపాటు కానేరదు. రైతులు (ఏలాకాలో!) సాధారణముగా నందఱును దరిద్రులే! టపా సౌకర్యములు ఖాల్సాలోనే సరిగా లేనందునను సంస్థానములకు దానితో సంబంధము లేనందునను తప్పుపట్టుట తప్పే యగును ఇట్లుండియు గద్వాల వనపర్తి సంస్థానములలో ప్రాచీనమునుండియు కవిపండితుల సమ్మానము జరుగుచుంటచే నిప్పటికిని నాసంస్థానములలో పండితుల నిలుకు కొంత మిగిలి యున్నది. ఈ సంస్థానముల అధిపతులు మనస్ఫూర్తిగా తలపెట్టిన నిజాం రాష్ట్రాంధ్రు లందఱిని నచిరకాలములోపలనే యుద్ధరించగలరు. కాని ప్రకృతము తమ సంస్థానప్రజల నైన నుద్ధరించిన నదియే పది వేలు.

ఆర్థిక స్థితి

తెలంగాణా రైతులు మరాట్వాడా రైతుల కన్న బీదవారు. మరాట్వాడా భూములు సారవంత మైనవి. తెలంగాణా భూములు చాలవట్టు చెలకలు (ఇసుక నేలలు) వ్యవసాయము కూడ చాల మోటుగ నున్నది. కొన్ని తావుల విత్తనము భూమి దున్ని చల్లుటయో లేక చేతితో విత్తనములు నాటుటయో యై యున్నది. రైతులు విశేషముగా అప్పుల పాలై యున్నారు.

హైద్రాబాదునగరము ఆంధ్రుల స్థానమే. నగరమందు ఆంధ్రులు సుమారు రెండు లక్ష లున్నారు. మహారాష్ట్రులు ౩౦౦౦౦ మాత్రమే యున్నను ఉద్యోగులు, వకీళ్ళు, ఇతర గౌరవవృత్తులు కలవారు మహారాష్ట్రులే. ఆంధ్రులలో వకీళ్ళు కూడ ౩౦ మంది కన్న హెచ్చుగా లేరు. వారును పేరు ప్రతిష్ఠలు కలవారు కారు. ఉద్యోగములందు గొప్ప యుద్యోగులు లేనే లే రనవచ్చును.

మొత్తముపై

నిజాము రాష్ట్రాంధ్రుల స్థితి చాల హేయమై యున్నది. విద్యావ్యాపకము లేదు. గ్రామజనుల స్థితి చాల శోచనీయము. సౌకర్యములు చాల తక్కువ. విచారించువారు గాని సానుభూతి చూపువారు గాని లేరు గష్తీ నిషాన్ ౫౩ అనునది ప్రజల వాక్స్వాతంత్ర్యమును నిరోధించుచున్నది. ఇది చాల విపరీత మైన గష్తీ. అధ్యక్షుని పసందు, ప్రభుత్వమునకు కావలెను. పది దినములకు ముందే జిల్లాకలెక్టరు అనుమతి సభకై పొందవలెను. ఉపన్యాసకు లెవరో వా రేమి మాట్లాడుదురో తెలుపవలెను. రాజకీయముల వాసనయే కూడదు. రాజకీయేతరముల కీ పై కట్టుబాట్లు, ఇట్లు కొన్ని యిబ్బందు లున్నను మా రాష్ట్రము ఇతరదేశీయ రాష్ట్రముల కన్న చాల మేలే. రైతుల కష్టములను అప్పుడప్పుడు పన్నులు మాఫు చేయుచు తొలగింతురు. పత్రికలకు కొంత స్వాతంత్ర్య మున్న దనవలసినదే. ఈ రాష్ట్రములోని పత్రికలు వ్రాయునట్లు తీవ్రముగా నితరసంస్థానములలో వ్రాసిన పత్రికలు చాలకాల ముజీవించి యుండవు. న్యాయ మైన సత్య మైన విమర్శనమును ప్రభుత్వమువారు నిరసింపరు. ఏది యెట్లున్నను ఆంధ్రులు తమ సంఖ్యను బట్టి ప్రభుత్వోద్యోగములందు గాని, స్వతంత్రవృత్తులందు గాని, వ్యాపారవ్యవసాయము లందు గాని చాల వెనుకబడి హీనస్థితియం దున్నా రనుట నిర్వివాదాంశము.

సాహిత్యము

శ్రీ జమ్మలమడక మాధవరామశర్మగారు

సాహిత్యశబ్దానికి "సహితానాం భావః సాహిత్యం" అనేది శబ్దవ్యుత్పత్తి ననుసరించిన సామాన్య నిర్వచనం. సాహిత్యసామ్రాజ్యంలో గోచరించే ప్రాతిస్వికరూపాలు సాహిత్యరూపాన్ని సంపాదించుకొని ప్రతిష్ఠను పొందుతవి.

అంగముల ఆనందకత్వం ప్రధానానుసారి. ఈసాహిత్యం లలనాలావణ్యప్రఖ్యం. వనితాశరీరంలో ప్రత్యేకావయవాలకంటె భిన్నపదార్థం గోచరించుతుంది. అదే సృష్టినిర్మాణచాతుర్యం. ఆనందప్రదమైన లావణ్యం.

సాహిత్యానికి లావణ్యసాదృశ్యం విశిష్టధర్మాన్ని సంపాదన చేస్తుంది. సాహిత్యం విశేషరూపాలకంటె భిన్నమైన విశిష్టధర్మం. అఖండోపాధి. విశేషరూపాలు విశిష్టధర్మాన్ని విడిచిపెడితే స్వారస్యసంపాదన చేయలేవు అవయవాలు అవయవిని విడిచితే స్వరసములు కావు. విశిష్టధర్మం జీవనప్రదం.

అనేకవిజాతీయాల విశేషసంబంధం సమరసమైన అఖండధర్మాన్ని సంపాదించుతుంది. ఈప్రధానసూత్రానుసారంగా అమణులు స్థితిని పొందుతవి. ఆవికీర్ణతేజోరేఖలకు సాహిత్యం నిత్యప్రకాశకల కేంద్రస్థానము.

విడివిడిగా భిన్నధర్మాలతో కూడుకొన్న మాదకద్రవ్యాల సంబంధం మదశక్తిని కలుగజేస్తుంది. ఆకు వక్క సున్నముల కూడిక రక్తిమను సంపాదించుతుంది. శాస్త్రముల యోగ్యబంధంలో సాహిత్యదీపం వెలుగుతుంది.

వాఙ్మయగతమైన సాహిత్యం ఆనందప్రదమైన అఖండశక్తి, లక్ష్యస్వరూపసాన్నిధ్యప్రాప్తి సాహిత్యంలో మిళితమై ఉంది. సాహిత్యవేత్తకు ఆనందసామ్రాజ్యములో నీ లక్ష్యశుద్ధి ఉంటుంది.

ప్రకృతిశరీరంలో శాస్త్రాలు అవయవాలు. ఇవి బాహిరాకారాన్ని నిరూపించుతవి. భిత్తిచిత్రం మాదిరి ప్రకృతిశరీరం ఇందులో గోచరించుతుంది. కాని ప్రధానజీవం పొడగట్టదు. సమస్తశాస్త్ర సమ్మేళనంలో ఆనందసింహాసనం మీద సాహిత్యశక్తి తేజోరూపంగా భాసించుతూ కళాప్రచారం చేస్తుంది. శాస్త్రీయరహస్యమే సాహిత్యంలో ఇమిడి ఉంటుంది. అయినా ఇందులో చైతన్యస్ఫూర్తి ఉంది.

ప్రతిప్రాణికీ జీవితలక్ష్యం ఆనందమే. ఈఆనందమే సాహిత్యరహస్యం. సమస్తశాస్త్రాలు ఆనందాన్వేషణం చేసినవి. వీటి సామరస్యంతో ముందుగా అనాయాసంగా సాహిత్యతత్త్వం ఆనందచుంబనం చేసింది.

అఖండజగత్తులోని తేజోధామము సాహిత్యతత్త్వవేద్యము. సాహిత్యము సమరసము. సాహిత్యోపాసన సంవిత్సామ్రాజ్యసార్వభౌమత్వం సంపాదించుతుంది.

తత్త్వనిరూపణముకై బయలుదేరిన శాస్త్రాలు ప్రకృతి ప్రత్యేకరూపం తెలియజేసినవి. చివరకు అందులోనే పర్యాప్తిని పొంది తరువాతి వారికి పూర్వపక్షకోటిలో చేరినవి.

కేవలం కాయికాదికర్మలకు ప్రాధాన్యం అంగీకరించి పాశ్చాత్యసృష్టితో ప్రపంచతత్త్వానుసారంగా ఫలనిర్ణయం చేయటానికి మీమాంస ప్రయత్నించింది.

ఒకవాచికధర్మం లక్ష్యంగా సమస్తజగత్తునూ సమన్వయం చేస్తూ పరా, పశ్యంతీ, మధ్యమా, వైఖరీ రూపమైన శబ్దబ్రహ్మధ్యానమే ప్రధానమని వ్యాకరణం ప్రతిపాదించుతోంది. ఇందులో పరావిత్తు పరానందము.

సమస్తప్రపంచరహస్యాన్ని సూక్ష్మరూపంగా ధ్యానించి అణుతత్త్వం వ్యక్తం చేసి దీనికి కారణం ఏమిటో ఊహించమని న్యాయం వైశేషికం బుద్ధి సమున్మీలనం చేస్తున్నవి.

సృష్టిక్రమాన్ని స్పందరహస్యం దగ్గరనుంచీ స్పష్టం చేసి బుద్ధి వికసించితే బంధత్రయచ్ఛేదం చేసుకోమని సాంఖ్యం శెలవిచ్చింది.

అంతటా సాంఖ్యాన్ని అనుసరించుతూ బంధచ్ఛేదనసాధనాలు నిరూపించి సహస్రారసుధాసాగరంలోని పీయూషమార్గాన్ని యోగం చూపించుతోంది.

ఇవి ఏవీ పరమార్థసాధనంలో బాగా ఉపయోగించవని బాదరాయణమహాని బాజా వాయించాడు. కర్మల చిత్తశుద్ధితో తర్కప్రతిభలోని బుద్ధి సమున్మీలనంతో సాంఖ్యబుద్ధివికాసంతో, వ్యాకృతిలోని అంతర్ముఖమైన పరానుసంధానంతో పీయూషలహరీమార్గం చూపించుటయే కాక, అద్వైతం, పరబ్రహ్మజ్యోతిని దర్శింపచేసి ఆనందమయం చేసింది.

వీటి సమ్మేళనస్వరూపం సాహిత్యం. శాస్త్రానుసంధానఫలాన్ని అనుసరించుతూ ఆంతరంగికమైన అంతర్ముఖాన్తర్జ్యోతిని దీపింపచేసి అనుకూలమార్గాన్వేషణం చేయించుతూ ఆనందరసం చేర్చేది సాహిత్యమే.

సాహిత్యం తను సమరసం కాబట్టి శాస్త్రాలకు సామరస్యం సంపాదించింది. దుష్ప్రవేశం, దుర్గమం, కర్కశం, అయిన రీతిని విడిచి, అందరిపై సమబుద్ధితో ఆనందం వర్షించింది. విశ్వమోహనగానంతో సాహిత్యం ప్రపంచపాషాణం కరిగించి ఆనందరసప్రవాహం వెలిగొలిపింది.

చారిత్రికంగా చూస్తే శాస్త్రాలు బయలుదేరిన తరువాత సాహిత్యస్ఫూర్తి విలసిల్లినట్లు స్పష్టం. సాహిత్యవిశిష్టరూపం శాస్త్రతత్త్వాలతో కలిసి ఉండటం అర్వాచీనతాహేతువాదాన్ని దృఢం చేస్తుంది.

సాహిత్యం ఆనందగ్రంథి. అపత్యరూపం. అపత్యం తల్లికీ, తండ్రికీ సమానంగా ఉద్దిష్టానందం ఇచ్చి తారకమై అభివృద్ధిహేతువైనట్లు, సాహిత్యం శాస్త్రాలకు విరుద్ధం కాక వాటి ఆనంద (లక్ష్య) రూపంగా ఉండి లోకంలో సన్మార్గప్రవర్తకం అవుతుంది.

అలంకారశాస్త్రం సాహిత్యం కాదు. సాహిత్యవిజ్ఞానానికి సంజీవనౌషధి సర్వశాస్త్రములు ఏకోన్ముఖమైన తత్త్వం అలంకార శాస్త్రవాహినిలో ప్రవహించి సాహిత్యసాగరం చేరుతుంది. ఇది సాహిత్యానికి సన్నిహితమార్గం.

ఇక్కడ యౌగికసమన్వయం కుదురుతుంది.

యమనియమాసన. • ప్రాణాయామప్రత్యాహార ధ్యానసాదృశ్యం శాస్త్రసముదాయానికి సమన్వయించుకోవచ్చు. ఈ అవస్థలో ధ్యేయం స్పష్టమయింది కాబట్టి లక్ష్యసిద్ధి ఉంది. ధారణా సాదృశ్యం అలంకారశాస్త్రానికి రూఢం చెయ్యవచ్చు. ధారణలోని నైరంతర్యం సంప్రజ్ఞాతసమాధిలోని ఔన్మన్యం సంపాదించుతుంది. అలంకారశాస్త్రానుసంధానం సాహిత్యప్రవణమైన ఔన్మన్యం సంపాదించుతుంది. అసంప్రజ్ఞాత సమాధిలోని అఖండకళ్యాణానందరసం సాహిత్యతత్త్వం.

అలంకారశాస్త్రపఠనమాత్రాన సాహిత్యవిత్త్వం రాదు. ఈశాస్త్రం “మార్గదర్శీమహర్షిః”

సాహిత్యతత్త్వంపరాపరరహస్యం. సాహిత్యసన్నిహితమైన అలంకారశాస్త్రం వస్త్వలంకారరసములనే వ్యంగ్యత్రయంతో ఉంటుంది కాబట్టి అక్షరతత్త్వం కూడుకొన్నది. ఇది అకథాధ్యాత్మకం. సర్వసిద్ధిప్రదం. అతిరహస్యం మిగిలిన వాటితో ఇతర శాస్త్రాలకున్న సంబంధాన్ని ఈ వక్రతత్త్వం తెలుసుకున్నవాళ్లు గ్రహించుతారు.

సాహిత్యం నీరసం కాదు. నవరసముల సమష్టిరూపం. సృష్టిసర్వస్వం సాహిత్యంలో [illegible] బయ

లుదేరింది. సంహారక్రమాన్ని అనుసరించితే సాహిత్యం అవధి. శాస్త్రసముదాయానికి సాహిత్యం కేంద్రస్థానముగానూ గమ్యస్థానముగానూ ఉంది. ప్రపంచసారం సాహిత్యం. సాహిత్యానికి ప్రధాన మైన అవయవం అలంకారశాస్త్రం. ఇది శాస్త్రాల నన్నిటినీ వడబోసి నిగ్గు తేల్చుతుంది. చాలినన్యాయం దీనికే సమన్వయించాలి. గుణదోషవివేకం సౌందర్యనిర్ణయం, సారనిరూపణం చేసేది ఈశాస్త్రమే. సారస్వతోపాసకు డైన సాధకుడు అలంకారం చదుకపోతే వ్యర్థుడై వంచితు డౌతాడు. కుచకచోరుశ్రోణీసౌభాగ్యాదులే ఇందులో వర్ణన విషయం, అందువల్ల అనుపాదేయం అని అపవాద మాపాదన చేసిన అకోవిదులు ఉన్నారు. అది కేవలం శుద్ధశ్రోత్రియం మాట. అనుకూల మైన ఆనందం ఇందులోనే ఉంది. ప్రకృతి యుదారస్థితిని స్పష్టం చేసి ఊర్ధ్వదృష్టిని ఉన్నతసౌభాగ్యాన్ని ఉచ్చైఃపదవిని సంపాదించేది ఇదే. సమస్తోపాసనా పద్ధతుల్లో ప్రకృతిరూపమే ధ్యేయపదార్థం. ప్రకృతితత్వం తెలుసుకొంటేనే గాని బ్రహ్మసాయుజ్యం రాదు. పిల్లవాడు ముందుగా తల్లిని తెలుసుకొని తద్వారా తండ్రి నెరుగుతాడు. సాధకుడు ప్రకృతి తత్వం తెలుసుకొంటే తద్వారా బ్రహ్మపదార్థం తెలుసుకుంటాడు. సమస్తపదార్థాల్లోను బ్రహ్మ అనుస్యూత మనే శాస్త్రకారులు చెప్పారు కాని స్పష్టంగా నిరూపణం చెయ్యలేకపోయినారు. అసలు బ్రహ్మ "నేతి నేతి" విజ్ఞేయం అయినా సృష్టిసర్వస్వంలో ఎట్లా ఇమిడి ఉన్నదో నిరూపించింది అలంకారశాస్త్రమే.

రమణీయత్వం ఎక్కడ స్ఫురించుతుందో అది ఆనందరూప మైన బ్రహ్మం. సారభూత మైన సాహిత్యం, అలంకారశాస్త్రప్రధానాశయము చమత్కారనిరూపణము. అలంకారప్రపంచంలోని ప్రతి అణువూ చమత్కారంగా ఉండా లని నిరూపించారు. ఈశాస్త్రీయాంశంలో అంతటా చణుకు తళుకు, మెఱుపు గోచరించుతుంది.

శాస్త్రరచన నీరసం. సద్యఃఫలదం కాదు. అభ్యాసయోగంలో నిష్ణాతు డైన వాడికి ఫలం లభిస్తుం దేమో. ఎంత వఱకూ ఆనందాభిలాషికి శాస్త్రం బాధాకరం. అలంకారశాస్త్రం ఉన్మనీభావం మాదిరి సాహిత్యలీనత్వం సంపాదించుతుంది. ఇతరశాస్త్రాల సారం పిండి నవనీతం సంపాదించి ఇస్తుంది. దాన్ని అనుభవించటానికి సహృదయత్వం కావాలి. "హృదిప్రమదిమభాజి కావ్యామృతైః" సాత్వికసాత్వికభావం అతిశయించితే సాహిత్యప్రవణత కలుగుతుంది. అలంకారస్వర్ణవేదికపై కూర్చొని శాంతంగా సాహిత్యోపాస్తి చేస్తే ధన్యు లౌతారు.

ప్రవృత్తి కుపకరించేవి శాస్త్రాలు. ఆనందసాహిత్యాని కుపకరించేది అలంకారశాస్త్రం. దీనిలోని వర్ణనావిశేషాలతో ఆనందించడమే కాని ప్రవర్తనలో సమన్వయించుకోరాదు. "కావ్యవిషయే చ వ్యంగ్యప్రవృత్తీనాం సత్యాసత్యత్వపరీక్షా కేవల ముపహాసా యైవ ప్రకల్ప్యతే" అని ఆనందవాక్యము.

సాహిత్యం కళ. చంద్రుడు షోడశకళాపూర్ణుడు ఆకళల్లో సాహిత్యం సాదాకళ, ధ్రువకళ. సర్వోపాస్యం.

వేలము వెఱ్ఱి కవిత్వము

గన్నవరపు సుబ్బరామయ్యగారు

నేడు కవిత్వ మనేకవిధములు. అందులో వేలము వెఱ్ఱి కవిత్వ మొక విధము. కొంత కాలము నుండియు నీ వేలము వెఱ్ఱి కవిత్వము ఉప్పెనవలె దేశమును ముంచివేయుచున్నది. కలమును పట్టగలవారందరు కవినామధారు లగుదురు. కలమును పట్టుటకును కవిత్వము చెప్పుటకును ప్రారంభ మొక్కమారే యనుట యథార్థకథనము. పత్రికాప్రకటనాంతము ఈకవిత్వము. ఇది గద్యపద్యోభయాత్మకము; కాని పద్యాత్మకముదే పైచేయి. దీనికి భాషాపాండిత్యమే కాదు తత్పరిచయమును ప్రయాసమే కాదు ప్రయత్నమును పని లేదు. ఆద్యవస్థయయిన అక్కర లేనిది; కేవలము అయత్నసిద్ధము.

పదము లేరుడు కాయలు. అవియు నొక యేబదిని మించవు. వానిలో సంస్కృతపదములది మేలు పాలు; శతావధానుల కూతగ్రలు కొన్ని; మూరుమూలలవి కొన్ని; అలౌకికము లగు లౌకికములు కొన్ని; అవైదికము లగు వైదికములు కొన్ని; భావార్థకముల నెక్కించుకొని లుప్తభావార్థకము లయిన భావార్థకములు కొన్ని; 'ఇంచు'ల మాటున దగుల్కొని పొంచి చూచునవి కొన్ని; నెత్తిపయి 'ఇల్లు' కట్టుకొని కూరుచున్నవి కొన్ని; ఇట్టిది ఆసంస్కృతపదముల తీరు. అవి అన్యోన్య భీకరము లగు 'భిల్లీభల్లలులాయకభల్లుకఫణి. ఖడ్గగవయబలిముఖచమరీఝిల్లీహరిశరభాదు' లగు వన్యమృగములను బోలినవి.

'తెరిపుచకయలు, ఉమెతకయలు, అమవసనిసలు' కొన్ని; పిప్పులు కొన్ని, పుప్పులు కొన్ని; బిగిసినవి కొన్ని, సడలినవి కొన్ని; నిడునిడుదలు కొన్ని, గిడ్డగిడసలు కొన్ని. ఇట్టిది మిగిలిన తెలుగు పదముల సౌరు. అవి ఒండొంటిని మచ్చరికించు గృహాగ్రామసంచారు లగు జంతువులను బోలినవి. ఇవి గ్రామవాటికే కావు, దేశవాటీలు కూడ. ఏవంవిధ శబ్దాత్మకజంతుసమూహముల కీ వేలము వెఱ్ఱికవిత్వము పాలికలను. వీని సమర మతిసంకులము; సంకరము. వీని యార్భాటము కర్ణారుంతుదము. తీరనిది పోరు. ఏనాటికిని పొత్తు కలియబోదు.

ఏవంగుణ విశేషణ విశిష్ట శబ్దసముంచిత మగు కవిత్వము నిర్మాణము, స్వభావము విదేశభాషా సంప్రదాయ సాధనసంపన్నములు. పట్టపగలింటి దొంగతనము దాన కొంత; కొండొక్కచో నంతయును. ఈ వేలము వెఱ్ఱి కవిత్వమున పదములు, భావములు అతుకవు, ధార కలమున నుండి స్రవించు 'సిరా' యందే కాని కవిత్వమున కనుపించదు. అక్షరముల పొందిక పదములకు కుదురదు. బంతుల తిన్నదనము రచనమున మృగ్యము. ఛందస్సు స్వచ్ఛందము. యతికి సత్త్వము, ప్రాసకు వాసి లేవు. పాదములకు తడబాటు అధికము. తరచునవి యీవలావల బడుచుండును. అనిర్వాహ్య మగు అఖండత గిట్టదు. వస్త్వాశ్రయము నొల్లని వైరాగ్యము, అర్థదారిద్ర్యమువలన భావార్థసంపాదన మసాధ్యము. ఏవంరూప మగు నీకవిత్వము పండితులకు అపండితులకు ఒక్క తీరుననే వెఱ్ఱి నెక్కించును. దీనివలన సహృదయులు విగతహృదయులు, అథవా, విపరీతహృదయులు కాక తప్పదు.

పత్రికల పంచ నీ వేలము వెఱ్ఱి కవిత్వము బ్రదుకుచున్నది. దీనివలన కవితాగౌరవము కడమపడుచున్నది. ఇది బ్రదికి యుండునంత దనుక సహృదయులు కవిత్వతత్త్వ విషయమున నస్తినాస్తి విచికిత్సా బీభత్స హృదయులయి యటమటించు చుందురు.

*దొంగాటకం

విశ్వనాథ కవిరాజుగారు

(రాత్రి ౧౦-౩౦ గం. రాజ్యం తమలపాకు చిలకలు చుడుతూంది. ౨౨ సం॥ కొంచెం పెద్ద నుదురు. సోగకళ్లు. చిఱుతవాటు మొఘం తెలివితేట లున్నట్లే కనబడుతుంది. ప్రకాశం ౩౦ సం॥ ఒడ్డూ పొడవూ మంచి బందోబస్తూ గల మనిషి. మాట కూడా గంభీరంగానే వుంటుంది. నిక్కరూ స్వెట్టరూ వేసుకొన్నాడు. షిల్ ప్రూఫు స్ప్రిక్ కిల్సు. రిస్టువాచీ. థెర్మోఫ్లాస్కు మెళ్ళో తగిలించుకొన్నాడు. చేతులో బేటరి లైటు. స్లిప్పర్సు వదలి జోళ్లు తొడుగుతూ)

ప్రకా—అప్పుడు పంపు కొట్టావా సైకిల్ కి.

రాజ్య—ఆ.

ప్రకా—కేసులో పెట్టావా సిగరెట్సు.

రాజ్య—లేదు,

ప్రకా—ఇంకా కిల్లీలు కట్టలేదు కదూ!

రాజ్య—ఎన్ని ?

ప్రకా—రోజూ చెప్పవలెనేమో! అర డజను. అప్పుడే ౧౦-౪౦.

రాజ్య—అంటే యీవాళ కూడా దొంగాటకానికి బయలుదేరుతున్నారన్న మాట.

ప్రకా—ఆ. వాడీ వూళ్ళో గలాటా చేస్తూండే వరకూ లేకుంటే వాడు పట్టుపడే వఱకూ మనకీ పని తప్పదు.

రాజ్య—ఈ ౧౦-౧౨ రాత్రులూ కాళ్లకు నెత్తుర్లు దిగేటట్టు వూరంతా తిరిగేరు గాని కొసకి ఆ దొంగను పట్టగల్చేరా ?

ప్రకా—ప్రయత్నం మన చేతుల్లో వుంది గాని ఫలితం ఎవరు చెప్పగలరు? ఈవేళ కాకుంటే రేపు దొరుకుతాడు.

రాజ్యం—ఏం? పోలీసులు లేరూ సెలవు

బోలెడేసి జీతం తీస్తూ? మీ రెందు కింత శ్రమ పడడం?

ప్రకా—వాళ్లు దొంగ దొరికిన తర్వాతనే కనబడతారు, పట్టివ్వడం మన బాధ్యతే. కొట్టులో పెట్టడం మాత్రం వాళ్ల పని.

(రాజ్యం—మరి వూళ్లో యిందరు వస్తాదులూ తాలింఖానావాళ్లూ వున్నారు—

ప్రకా—వున్నారు. వాళ్లు మరో వస్తాదు వచ్చి బస్తీ మీద సవాలు కొడితేనే పైకి వస్తారు. రాజ్యం! ఎంతో ధైర్యసాహసా లుంటేనే కాని మనిషి ఇంత పనికి పూనుకోలేడనుకో. దొంగతనానికి వచ్చినవాడు అన్నిటికీ సమస్త తెగింపులూ చేసుకొనే వస్తాడు. వాణ్ని ఎదిరించడమంటే సామాన్యమైన పని గాదు—మనమూ ప్రాణాలకి తెగించాలి.)

రాజ్యం—అయితే యెవ్వరికీ లేనిదీ మన కెందుకీ ఘోరసాహసం? పుణ్యమా పురుషార్థమా?

ప్రకా—కీర్తి? పేరు ప్రతిష్ఠలు? ఇప్పటికే వూళ్లో నా పేరు ఆదొంగ పేరు కంటే యెక్కువగా మ్రోగిపోతున్నది. ఇదివరకు నాతో పరిచయం లేని పెద్దమనుష్యు లెందరో నాకీ మూలాన స్నేహితులైనారు. ఎంతో మంది బి. యే. స్టూడెంట్సు మొదలైన వాళ్లు కూడా నా వెంట వస్తూ నా చెప్పుచేతలలో తిరుగుతున్నారు. ఇంకేం కావలే చెప్పు!

రాజ్య—బాగానే వుంది గాని మన కేదైనా ప్రమాదం వస్తే ఈ స్నేహాలు రక్షిస్తవా?

ప్రకా—నాకే ప్రమాదం రాదనే ధీమా నాకున్నది. నా బాకు నాదగ్గర వుంటే చాలు.

---

* వూళ్లో వొక యింటోనే చోరీ జరిగితే దొంగతనం అంటారు. వొక వూళ్లో రోజూ రోజూ అనేక చోట్ల చోరీలు జరుగుతూవుంటే దాన్ని దొంగాటకం అంటారు. ఇది విశాఖపట్నం జిల్లాలో వాడకంలోవున్న మాట.

రాజ్య—ఆదొంగ రివాల్వరు పట్టుకొని వుంటాడేమో!

ప్రకా—రివాల్వర్ ఎదురుగుండా వుంటేనే పేలుస్తుంది. బాకు వెనకనుంచి పొడుస్తుంది.

(రాజ్య—ఒకరి ప్రాణం తీసివేస్తే గవర్నమెంటు వూరుకుంటూరా?

ప్రకా—ఆత్మసంరక్షణార్థం చంపేవ్వంటే తప్పకుండా వూరుకొంటారు. అందులో ఇటువంటి గజదొంగను చంపేమంటే ప్రెశంటు కూడా యిస్తారు. అసలు ఇటువంటి సాహసం చేసినవాళ్లనే డిటెక్టివులుగా వేస్తారు.)

రాజ్య—ఎది యేలాగైనా మీరు పెట్రోలింగుకు వెళ్లడం నాకిష్టం లేదు.

ప్రకా—ఇది బాగుంది! రామాయణమంతా విని రాముడికి సీత యేమవుతుం దని అడిగిందట. ఏమిటి నీకు భయం!

రాజ్య—నాకంతా భయమే. మిమ్మల్ని గురించి—నన్ను గురించీ కూడా. ఆదొంగవెధవ యెవడో—పెళ్లాం పిల్లలూ లేని దిక్కుమాలిన ముండాకొడుకు—అన్నిటికీ తెగించి వస్తాడు—వాడి చేతిలో మీరు దొరుక్కుంటే యింకేమైనా వుందీ! మీరు వూళ్లో పెట్రోలింగుకు వెళ్లిన తర్వాత వాడు మనయింట్లోనే ప్రవేశిస్తే—నా ప్రాణాలు ఉన్న వున్నట్లు లేచిపోవు? మన కిప్పుడున్న కీర్తి చాలు. మీరు వెళ్లనే వద్దు.

ప్రకా—నేను వెళ్లకుండా ఇంట్లో కూర్చుంటే తక్కినవాళ్లందరూ వచ్చి మన యింటిమీద పడి నన్ను బయటకి లాగుతారు.

రాజ్య—జ్వరం వచ్చిం దని చెప్పి కప్పుకొని పండుకోండి.

ప్రకా—ఎన్నాళ్లని పండుకొంటాను? నాకీ అబద్ధాలూ పిరికిచేష్టలూ నచ్చవు సుమా! దేవుడు నన్ను మగాణ్ణి చేశాడు. నేను మగాడుగా వుండవలె.

రాజ్య—కాని దేవుడు నన్నాడదానిగా చేశాడు గదూ—నాపిరికితన మేలాగు పోతుందీ? (తన్ను కూలిన ధర్మం మొదలు చెడ్డ బేరం వుండవు. ఇంట గెల్చి రచ్చ గెలవ మన్నాడు.) మొదట స్వవిషయం చూసుకోండి.

ప్రకా—వీలు లేదు. నాకు స్వవిషయం కంటె లోకవిషయమే ముఖ్యం. ౧౦—౧౫ ఇంక వెళ్ళాలి. ఆకిల్లీలూ బాకూ అందుకో.

రాజ్య—మీరు లక్ష చెప్పండి—నేను వప్పను. అదేమో ఏరోజుకంటె యీవేళ నాకు మరీ భయంగా వుంది. (మీరు సినిమానుంచి ఒక గంట రావడం ఆలస్యం అయేసరికి నేను వెర్రెత్తిపోయినాను.)

ప్రకా—ఇంక నీ కింటి దగ్గర కాపలా కూర్చుని నేనపకీర్తి పాలు కావలెనా?

రాజ్య—కీర్తో అపకీర్తో. అర్ధరాత్రివేళ నేనొక్కర్తెనూ ఇంట్లో వుండలేను.

ప్రకా—ఇల్లు యినపపెట్టెలా గున్నది.

రాజ్య—కాని నామనస్సు! ఆవేశమంతా విప్పండి ఇవుగో రెండు కిల్లీలు కట్టాను. ఇవి చాలులెండి. గడచిన ౧౨—౧౫ రాత్రులూ నిద్ర లేనే లేదు. ఈరాత్రి అయినా సుఖంగా నిద్రపోండి.

ప్రకా—ఆదొంగవెధవ యీవూళ్లో తిరుగుతూన్నంతవరకూ నాకు ఇంట్లో పండుకొన్నా నిద్ర పట్టదు.

రాజ్య—లేకుంటే జబ్బు చేస్తుంది.

ప్రకా—సిధర్మమా అని అదిమాత్రం తెచ్చిపెట్టకు. దైవకృపవల్ల నాశరీరం వుక్కు తునక—వజ్రపు ముక్క.

(రాజ్య—కాని మానవశరీరం—విధిగా విశ్రాంతి కావలె.

ప్రకా—ఔను. ఏవో మాటలలో పెట్టి నన్నిలాగు నిలబెట్టేస్తే యెట్లా ?)

రాజ్య—మీరీ రాత్రి గడప దాటి అవలకు వెళ్తే నేను వప్పనండి. కావలిస్తే తెల్లవారి పుదయం నన్ను మాపుట్టింటికి పంపించివేసి మీరు—

ప్రకా—ఔను గాని యేమిటీ మొండితనం! నీమాటే నీదా ?

రాజ్య—మొండితన మనండి—గయ్యాళితన మనండి. నాభయం తీర్చమని నేను నాభర్తను కోరడం తప్పు కాదుగద. నామనస్సు భయంచేత యెలాగు గడ్డ కట్టి పోయి వుందో మీకేం తెలుసు? మీకున్న ధైర్యసాహసాలు లోకంలో అందరికీ—స్త్రీలకీ బాలురకీ సహా వుంటా యనుకోవడం మీ తప్పు.

(లోపలనుండి)

మిస్టర్ షైలాక్ హోమ్స్ !

ప్రకా—రైటో—కమింగ్.

రాజ్య—మీరు మాత్రం వెళితే నేను వప్పనుసుమండీ. తర్వాత నన్నని లాభం లేదు. వాళ్ళనేదో చెప్పి పంపించేసి రండి. ఈవేష మంతా విప్పండి (తానేవిప్పి) ఈశాలువు కప్పుకొని వెళ్లి జ్వర మని యేదో చెప్పి చక్కారండి (తానే శాలువు కప్పును)

ప్రకా—మన దేశంలో పురుషుల ధైర్యసాహసాలు చావడానికి స్త్రీలే కారణ మని యిప్పుడు తెలిసింది. షేమ్ షేమ్. (వెళ్లును)

రాజ్య—(వస్తువులు సర్ది ప్రక్కలు రెండు మంచాలపై పఱచి నడుమ ఈజీచైర్ వేసి యింకేమేమో సవరించుచుండును)

ప్రకా—(వచ్చి) చా చా చా! నావుత్సాహమంతా ధ్వంసం చేశావు. నాచేత అబద్ధ మాడించేవు. వాళ్ళను పంపించివేశాను. ఇంకేమి చేసేది? (మంచము మీద కూలబడును)

రాజ్య—ఆపాప మంతా నాదే లెండి కాని వాళ్లు వెళ్లి పోయారా ?

ప్రకా—ఆ. ఏమైనా అంత అవసర మైతే సైకిల్ మీద కబు రెట్ట మన్నా.

రాజ్య—నిన్న రాత్రి యేమీ లేదట గదూ!

ప్రకా—లేకపోవడ మేం? నిన్న రాత్రే ఘోరం జరిగింది. నిన్న ౧౨ గంటలకి కోమటి వీధిలో పడ్డాట్ట. ఒక కోమటీ—తన కొడుకూ—ఇంకా యెవరో ముగ్గు రొక గదులో గడియ వేసుకొని పండుకొన్నా రట. ఏలా గొచ్చాడో ఆగదులో కొచ్చి కోమటి తలకాయ మీది కత్తి తాళా లేవన్నాట్ట. దానితో ఆకోమటి గగ్గోలెత్తి పోయి నోట మాట రాక—చేత కాని ముండాకొడుకై పోయినాడు—లేకుంటే తాళాలు కావాలిరా స్కౌండ్రల్ అని గూబ పగలేయ వల్సింది.

రాజ్య—అయితే యే మయింది తుదకి ?

ప్రకా—వేటకాడు మెత్త నైతే లేడి మూడు కాళ్లతో నడుస్తుంది. దానితో ఆదొంగవాడు పీక పట్టుకొని—నోట్లో గుడ్డలు కుక్కి—

రాజ్య—అబ్బా—చెప్పకండీ—నాకు భయం వేస్తూంది. ఈవాళ సినిమా కథ చెప్పండి.

ప్రకా—"ముసుగుదొంగ"—అదీ దొంగ కథే.

రాజ్య—ఆకథావొద్దు సినిమాలోనూదొంగలే. వూళ్లోనూ దొంగలే. మరేదైనా మంచి కథ చెప్పండి,

ప్రకా—౧౧-౩౦ అయింది. ఇప్పుడు కథేమిటి గాని పెరటి తలుపు లన్నీ దిట్టంగా వేశావా ?

రాజ్య—వేశాను. నాకంత కంటే భయం. మీరా దొంగ నెప్పు డైనా చూశారు ?

ప్రకా—చూస్తే విడిచిపెడతానూ? చూడక పోయినా విన్నదాన్ని బట్టి పోల్చగలను లే.

వీడంతా వొక సినిమా దొంగలాగు తయారవుతాట్ట. తలమీద పెద్ద విగ్గొకటి. యెవడో ఆజుట్టు పట్టుకొనేసరికి అది వాడిచేతులో వుండిపోయిందట—వీడు పారిపోయినాట్ట. వీడు లోపల యినపతీగల బనీను తొడుక్కుంటాట్ట. నేనూ వొకటి కొందామని చూస్తున్నా. ఒక పోలీసువాడు కత్తితో పొడుస్తే—దెబ్బ తగలలేదట—వాడు పారిపోయినాట్ట. చేతిలో టార్చిలైటొకటీ—వొక చేతిలో రివాల్వరు—మామూలుగా కత్తి మొలలో వుంటుందిట—బాకొకటి ట—మెళ్లో నాలాగే కాఫీతో థర్మోఫ్లాస్కుంటుంది ట—

రాజ్య—మరి ఆసంగతి చెప్పకండి. నేనొక్కటడుగుతాను—చెస్తారూ?

ప్రకా—ఏమిటి కథా?

రాజ్య—మీకు పండుకోవడమే నిద్ర వస్తుంది. నాకు రాదు. అంచేత నేను ముందర పండుకుంటాను. మీ రేదైనా చదువుతూ వుండండి. నేను నిద్రపోతాను. తర్వాత మీరు నిద్ర పోదురు గాని.

ప్రకా—ఏం చదివేది? ఇంగ్లీషు పుస్తకాలు నీకర్థం కావు. తెలుగంటే నాకసహ్యం.

రాజ్య—పోనీ యింగ్లీషు పుస్తకమే చదివి తెనుగన చెబుదురూ.

ప్రకా—(లేచి వెళ్లి పుస్తకం తెచ్చి) ఇదిగో 'మార్కండేయా' అని ఇది చాలా మంచిపుస్తకం. దీన్ని నాన్‌డిటెల్డు అంటూరు (చదివి చెప్పుతూ) అప్పుడే నిద్ర పట్టింది (పుస్తకం మూసి యీజీచైరులో పెట్టి తానూ పండుకొనును)

రాజ్య—దీపం తగ్గించేస్తురు అమ్మమ్మ!

ప్రకా—ఇంకా నిద్ర పట్టలేదూ? (తగ్గించి పండుకొనును)

(పెరటిలో పెద్ద చప్పుడు)

రాజ్య—(దిగ్గున లేచి) అమ్మో! ఏమిటది? ఎంత చప్పుడో!

ప్రకా—ఏమిటి చెప్మా!

రాజ్య—దొంగ! తప్పకుండా దొంగ! నిస్సందేహం.

ప్రకా—ఉండు క్షణ ముండు (జాగ్రతగా విని) ఇప్పుడేం చెయ్యడం!

రాజ్య—కేకలు పెడదాం—దొంగో అని గట్టిగా?

ప్రకా—నలుగురూ మూగి చూసిన తర్వాత ఏదొంగా లేకపోతే నాకు కమ్మ కట్టివేయరూ? చెప్తా. (ఏదీ గతి నాకు—గ్రామఫోను రికార్డు వేయును)

రాజ్య—(సగంలో ఆపి) అవతలనుంచి కొంప ములిగిపోతూ వుంటే ఈగ్రామఫోనువాద్య మేమిటి? (తీసి వేయును)

ప్రకా—వాడే దొంగయితే వాడికి మనం మేలుకొని వున్నట్లు తెలుస్తుంది.

రాజ్య—అయితే ఈల్లాగు తెల్లవార్లూ గ్రామఫోనుతో కూర్చుందామంటారా—యేమిటి? చా చా! పెరట్లో ఓమారు చూచి రండి.

ప్రకా—తలుపు తెరచే సరికి వాడు లోపల ప్రవేశిస్తే?

రాజ్య—అప్పుడే వెంటనే కేకలు పెడదాం.

ప్రకా—ఉండు, ముందర కిటికీ తెరచి చూదాం (తెరచును. పిల్లి లోపలకు గెంతును) పిల్లి! వెధవ గొడ్డు!

రాజ్య—బతికేం, భగవంతుడా! నాప్రాణాలు మీద కెగిరిపోయినాయి.

ప్రకా—రా. అయినా ఓమారు పెరడు చూదాం.

రాజ్య—అమ్మో! నేను రావమ్మే! నేను రాలేను సుమండీ!

ప్రకా—దొంగా మనిషివంటి వాడే! దొంగ నన్నా యింత భయమైతే యేలాగే? ఏదీ ఆటార్చి లైటూ బాకూ ఈలా గియ్యి నే చూసివస్తా! (తలుపు తెరచి వెళ్లును. రాజ్యం ముసుగు కప్పుకొని పండుకొనును. దొంగ మెల్లగా ప్రాకుకొని వచ్చి మంచము క్రిందికి పోవును. ప్రకా—తిరిగి వచ్చి తలుపు గడియ వేసుకొని) అప్పుడే ముసుగు తన్నేవా? ఏమి భయమే! ఆడవాళ్లకింత లేని ధైర్యసాహసాలు! వీళ్లకు పురుషులతో సమాన స్వాతంత్ర్యం కావలె నట! లేలే. ఏదొంగా లేడు.

రాజ్య—(ముసుగు తీసి మంచంపై కూర్చుని) లేడూ లేడూ! బ్రతికేం!

ప్రకా—మనం కాదు వాడు బ్రతికాడు ఏమం డాకొడుక్కి గుండె లున్నాయి మన యింటికి రావడానికి?

(దొంగ గప్పున ఇద్దరి యెదుటా నిల్చును)

ఇద్దరూ—ఓఓఓ...దొ—దొ—దొ—,

దొంగ—షటప్! (రివాల్వరు చూపి) తల పేలుస్తా నోరు విప్పితే.

ప్రకా—(ఒక చేతితో తన నోరు మూసికొని రెండవ చేతితో గట్టిగా ఆమె నోరు మూయును)

దొంగ—నోరు మూసుకొని కప్పుకొని ఆమెను పండుకో మని చెప్పు.

ప్రకా—పండుకో పండుకో. మాటాడితే గట్టిగా వూపిరి తీస్తే ఈయన తల పేల్చేస్తానంటున్నారు. లేకుంటే యేమీ అన రట. పండుకో (బలవంతముగా పండుకో బెట్టి శాలువు నిండా కప్పును)

రాజ్య—అమ్మో దొంగ! దొంగ! (ముసుగులో మూల్గుచుండును)

ప్రకా—ఎవరు దొంగ? ఆయన దొంగ అని అప్పుడే నీకేం తెల్సు?

రాజ్య—భయం భయం. హ హ హ హ. (వణికిపోవుచుండును)

దొంగ—నోట్లో గుడ్డ క్రుక్కి ఈమె నోరు కట్టివేయి. కదలకూడదు.

ప్రకా—ఈమె మలేరియల్ జ్వరంతో బాధ పడుతూంది. అందేత నే యీ వణకూ పలవరింతలూ. మాటాడకు రాజ్యం! (చెవిలో మెల్లగా) భయం లేదు. నేనున్నాను. నువ్వు హాయిగా పండుకో పండుకుం దండి.

దొంగ—ఆరాకింగ్ చైరు ఈలాగు వెయ్యి.

ప్రకా—తొందరలో గమనించలేదు. పాపం ఇంతసేపూ నిలబడిపోయినారు. (చైరు వేసి) దయ చేయండి.

దొంగ—(కూర్చుండి నోటుబుక్కు తీసి వ్రాసుకొనుచూ) మీ పేర్లు? మీ సంగతులు?

ప్రకా—నాపేరు రాజ్యలక్ష్మి. దీనిపేరు ప్రకాశరావు. వయసులు 30—25. భార్యాభర్తలం. కేస్టు హిందూస్. బ్రాహమిన్సు. నేను మేల్ ఇది ఫీమే లండి. అన్నట్లు మాయింటిపేరు ద్వివదుల వారండి.

దొంగ—మీయింటి దగ్గర యేమే మాయుధా లున్నవి?

ప్రకా—మేమేం రాజులం గనుకనా? సంసారులం—బ్రాహ్మలం. యే మాయుధా లుంటవి! కత్తిపీటా—కోరాం—పారా—బొరిగా—గునపాం.

దొంగ—అవి కావు.

ప్రకా—అయితే నాదగ్గర పెన్నైఫు—సేఫ్టీ రేజరు—సెల్ఫుషేవింగుకు ఎడోనిస్ బ్లేడ్సు ఒక డజను—అంతే—నా వైఫ్ దగ్గర కొన్ని హెయిర్ పిన్సు—చిన్నకత్తెర—

దొంగ—(విషపు నవ్వుతో) తమాషా! ఆయుధము లేదా?

ప్రకా—అన్నట్లు మరచిపోయినాను. ఒక్క చిన్న బాకున్నది. (ఇచ్చి) పనసకాయ కొట్టుకొందుకు మొన్ననే కొన్నాను. అట్టే దారుగా లేదు. ఉండ నివ్వండి.

దొంగ—ఈయిల్లు నీ దేనా?

ప్రకా—కాదండి. అద్దెకొంప. నెలకు రూ ౨౨ లు అద్దె. తమవంటి తగు మనుష్యులు వస్తే కూర్చోపెట్టడానికి మంచి గదైనా లేదండి.

దొంగ—నీకు సంవత్సరానికి రాబడి యెంత?

ప్రకా—ఏదో ౫ వంద లండి. అదైనా కాగితం మీదనే. మెరక భూములు. నిరుడు వరదలు వచ్చి భూములు ముంపు డైపోయినాయి. రైతువారీ గడుసుమీరి పోయింది. భూఖామందు ఖాతరే లేదు. (పోనీ దావాలు వేదా మంటే మున్సబు ముండాకొడుకు నాన్‌బ్రామిన్సు అయిపోయినాడు (నాల్క కొరుకుకొని) తమరు నాన్‌బ్రామిన్సా యేమి టండి లేకుంటే బ్రామిన్సేనా?)

దొంగ—ఊం—నీదగ్గర నగ దేమాత్ర ముంది?

ప్రకా—ఏ ముంటుం దండి? ఉన్నవాళ్ల మిద్దరం గాని ఖర్చు చాలా జాస్తీ అండి. అందులో నాభార్య జూబరా మనిషండి—వెఱ్ఱి పీరు.

దొంగ—సొమ్ము—నగదు—నీదగ్గర యేమాత్ర ముంది?

ప్రకా—చిత్తం చిత్తం. ఏదో దినవెచ్చానికి ౫-౬ వుంటుంది.

దొంగ—చూపించు తీసి చూపించు.

రాజ్య—అమ్మో అమ్మో!

దొంగ—నోరు మూసుకో నువ్వు. రెఛెడ్ వుమన్.

ప్రకా—అలాగే నండి—వట్టి దౌర్భాగ్యం మనిషి. మే మేదో వ్యవహారం మాట్లాడుకుంటూంటే నీమూలు గేమిటి? ఏమిటి కొంప మునిగిపోయింది? ఆయ నేదో అడుగుతున్నారు—నే నేదో చెప్తున్నాను—

రాజ్య—ఆసందుగ పెట్టె చూపించండి. ఇదుగో తాళం (తీసి యిచ్చును)

దొంగ—(బాకెత్తి) నువ్వు మాటాడే వంటే ఇది గుండెలలోకి విసరేస్తాను.

ప్రకా—క్షమించండి క్షమించండి. నువ్వాగుకో. (చెవులో మెల్లగా) కానీ కానీ—భయం లేదులే. ఈవేష మంతా చూసి చేయవలసిన పని ఆఖర్ని చేసివేస్తాను. నువ్వు పండుకో—మరి మాటాడ దండి. ఆసందుగుపెట్టె తెస్తునా?

దొంగ—ఆ అయిరన్ సేఫ్ తీయ వోయ్.

ప్రకా—కొంప, మునిగిపోయింది రాజ్యం! ఇనపపెట్టె కొననోయి కొననోయి అంటే కొనేదాకా ప్రాణం బుచ్చుకొన్నావు. సరదా తీరిందా?

దొంగ—ఏమి?

రాజ్య—తాళాలు పోయినా యండి.

దొంగ—(అమాంతంగా లేచి ...డేయపుస్తక మామె మొగముపై కొట్టును)

ప్రకా—ఉన్నా యండి ఉన్నా యండి. కాని సరిగా తిరగటం లేదండి. అసలు వూళ్లో దొంగాటకంగా వుందని పెట్టె మూసేసి తాళాలు నూతులోకి విసరేశా నండి—తర్వాత తీయించుకోవచ్చునని.

దొంగ—(లేచి వాని రెక్క పట్టుకొని) రా. దిగు. దిగి తీయవలె. పద.

రాజ్య—(దిగ్గున లేచి నమస్కరిస్తూ) మీధర్మ మాయె ఆయనను దింపకండి. ఆయన కీత రాదు. కావలిస్తే నన్ను తోసివేయండి నూతులోకి—తాళం వెదకి తీసి నేను పైకి విసరివేస్తాను.

దొంగ—నువ్వితని కంటె వట్టి పేచీమనిషిలాగున్నావే!

ప్రకా—పేచీమనిషా యింకా పేచీ మనిషా! ఈమెతో ప్రతిరోజూ నే నెంత బాధ పడిపోతున్నానో ఆపరమేశ్వరుడికి తెలుసును. మహా మూరురాలు!

దొంగ—సరే. తప్పాడు కాకుండా పెట్టె బద్దలుకొట్టే సాధనం నా దగ్గర వుంది. నేను చూస్తా. మరి మీకీ పెట్టె మాత్రం ఎందుకూ పనికి రాదు.

రాజ్య—బంగారం లాంటి పెట్టె—మొన్న నే కొన్నాం. విరగ్గే నివ్వకండి.

ప్రకా—విరవకండి సార్! నాదగ్గర మార్లిటు కీసు వున్న దండి. తీస్తా.

దొంగ—తాళాలు దగ్గర పెట్టుకో నేనా యిన్ని వేషాలు వేశావు దగుల్బాజీ. తీయి ౧౦ గుంజీలు తీయి ముందు.

రాజ్య—మొద్దు పిల్లకాయ లాగు గుంజీలు తియ్యడ మేమిటి! తీయవద్దు.

ప్రకా—అయన నోరు మూసుకో నోరుమూసుకో అని చెప్తూ వుంటే నీవు కాదూ? తీస్తా నండి సర్. మును గేసుకో అయనకి కోపం రాగల్దు.—(తీయును)

దొంగ—ఇదిగో నేను తగు మనిషితరహా చూపించేటప్పుడు మీరు అట్లే వుండవలె. తెలిసిందా? (మీరు పశువుల లాగు ప్రవర్తిస్తే మిమ్మ వేటాడే మార్గం నాకూ తెలుసును.) ఇది ౨౦-వ శతాబ్దం. ఎటువంటి ఘోర మైనా పాప మైనా కూడా నా జాముగా జరగవలె. నేను ౨౦-వ శతాబ్దపు మనిషిని. సజావుగా వ్యవహారం నడిపిస్తే నాలాభంలో నూటికి ౫ చొప్పున కమిష నిస్తాను (మీరు బైతుల్లాగు గగ్గోలెత్తితే మీప్రాణం పుచ్చుకొంటా. తెలిసిందా?) పెట్టె తియ్యి. ఒక్క యింట యింత సేపు కూర్చుంటే రేలా గౌను?

ప్రకా—చిత్తం చిత్తం. (తీసి) దయచెయండి.

దొంగ—(వెళ్లిచూచి) ఏం? ౫-౬ వుందన్నావు.

ప్రకా—అవునండి. ౫-౬ అంటే ౫-౬ వంద లన్న మాట.

దొంగ—అలాగా?......అవి ఒక కవరులో పెట్టు:

ప్రకా—చిత్తం.

దొంగ—అచిల్లర రూపాయి లెన్ని?

ప్రకా—౧౩-౧౫

దొంగ—అవి నీపైఖర్చు కుంచుకో—తెల్లవారజామే డబ్బుకోసం ఎక్కడికి పోతావు కనుక. ఆసామాన్లు తియ్యి—అ వెండి సామాన్లన్ని.

రాజ్యం—అయ్యారయ్యో! ఎంతో ముచ్చటపడితే మొన్న మొన్న నే, మాఅన్నయ్య వీటిని బొంబాయి నుంచి పంపించే డండీ,

ప్రకా—ఆ కష్టపడిపోయినాడు పాపం మీ అన్నయ్య. ౭౦౦ నేను పంపితే ఖర్చు పెట్టేసుకొన్నాడు కాబోలు మరి నెల్లాళ్లకు పంపేడు—ఎంత కమిషన్ తీసేడో!

దొంగ—మీభావమరదీ మీభార్యలాగే పరమ దగుల్బాజీ లాగున్నాడే.

ప్రకా—ఇంకా మెల్లిగా సెలవిస్తున్నారు—రొండుకు రొండే.

దొంగ—సరే. వెండిసామాన్లు ఇత్తడిసామాన్లు ఎవరు మోసుకుపోతారు—నా కక్కర లేదు. నేనిచ్చబోయే ౧౦౦ కి ౫ కమిషన్ కిందా అవి మీకే వుంచుకోండి.

రాజ్య—మంచాలు కుంచాలు బిందెలు చెంబులూ కూడా వదలివేస్తున్నారు కనుక అవీ కలిపి వేయండి ౧౦౦ కి ౧౦౦ కమిష నిచ్చిన గొప్ప మీ కుంటుంది.

ప్రకా—ఇదే యిబ్బం దండీ—ఏమి తెచ్చి యివ్వండి సంతృప్తి అన్నది లేదు ఈ ప్రాణికి.

దొంగ—బంగారవు నగలు కనబడవేం?

ప్రకా—ఉన్నవేవో మైవైపు వొంటిమీదనే వున్నవండి. నిద్రపోతూన్నప్పు డైనా వాటిని తీయదండి.

రాజ్య—అవే మాత్రం వున్నా యండి—కంటె వొడ్డాణం గొలుసూ నిరు డమ్మివేశా రండి.

ప్రకా—మరి యిల్లు కట్టడానికి సొమ్ము చాలకపోతే అమ్మివేశా నండి.

దొంగ—కట్టించి కట్టించి అద్దెయిల్లు కట్టించే శేమి టండి!

ప్రకా—చిత్తం చిత్తం. (అమ్మివేయడమే మేలైంది. అదైనా దక్కింది—లేకుంటే—

దొంగ—లేకుంటే?

ప్రకా—మరేం లేదు—తమ రొస్తా రని తెలియక అమ్మివేశాను. తెలిస్తే ఉంచివేదును. ఏదో అదీ యిదీ కలిసే తమకు కొంత అదనుకు పనికి వచ్చు నంటున్నా.)

దొంగ—ఆవిడ వంటిమీది వస్తువు లన్నీ తీయించి తీసుకు రండి.

రాజ్య—చెయ్యి చెప్పండి లక్ష చెప్పండి. పోతే నా ప్రాణమైనా పోనివ్వండి. నేనివ్వను.

ప్రకా—చూడు. ఆయన మాట కాదనకు. ఆయన మనస్సు కరిగి—'ఈ స్వల్పవస్తువులు ఇవి మన కేమాత్రం' అని తోచి ఆయనే వదలేయవచ్చును. ఈయన సామాన్యుడు కాడు. ౨౦–వ శతాబ్దం మనిషి ఈకాలంలో ఈయన వొక్కడే.

రాజ్య—నన్ను చిత్రవధ చేసినా సరే నేనివ్వను గాక యివ్వను.

ప్రకా—ఏమండీ సార్! మావా ళ్లివ్వ మంటున్నా రండి. ఫీమేల్ ఎంతో మంచి పతివ్రత అయితేనే కాని తన వొంటిమీద చెయ్యి వెయ్యనివ్వ దండి. తమకు పెళ్లయిం దండీ సార్!

(రాజ్య—అయితే ఆవిడ యెవరో మహా అదృష్టవంతురా లైయుంటుంది. దొంగ పెళ్లా మైనా కావలె దొర పెళ్లా మైనా కావలె అని.)

దొంగ—ఏమిటీ ఆలస్యం—మొదట ఆవస్తువు లందుకో.

ప్రకా—ఏలాగు నండి? మీరో సారి చెప్పి చూడండి.

దొంగ—నా ప్రారబ్ధం. నేను ఆడదాన్ని నగ లిమ్మని యాచిస్తానా—లేకుంటే బాధిస్తానా!

ప్రకా—నేను సిగ్గుమాలి యాచించినా లాభం లేకపోయింది. పోనీ కొంచెం బాధించనా అండి—నొక్కక పోతే మామిడిపండులోనుంచి రసం రాదు.

దొంగ—(టైము చూచి) ౧–౫ ఇంక నేను లేవవలె. వేగం కానివ్వండి.

ప్రకా—రాజ్యం! ఆయన్ని ఎంత వేగం పంపివేస్తే మన కంత మేలు. ఇవ్వక తీరదు. తే.

రాజ్య—ఇంక పోవడమే! ఏదో చేయవలసిన పని వీడి కాఖర్చు చేస్తా మన్నారు. మరచిపోయి నారా యేమిటి?

ప్రకా—సమయం చూస్తున్నా! ఇంకా వీడు పోయేవరకూ వేళ వుందిగా. మంచి వుపాయం ఆలోచిస్తున్నా. ముందు సరకులు తీసి వీడి మొఖం మీద పారవేయి.

రాజ్య—నే నేం వెర్రిదాన్ని అనుకున్నా రా యేమిటి? నే నివ్వ నండి.

ప్రకా—ఇవ్వకపోతే నీ గుడ్డేం పోయింది. 'ఆడవాళ్లని బాధిస్తానా' అని ఇత డనడం చేత నిన్నేమీ అనడన్న ధీమా నీ కున్నది. ఇంక నేనెలాగు సస్తే నీకేం? ఇవి నేను చేయించి పెట్టిన వస్తువులు కాని నియబ్బా నీ తాతా చేయించినవి కావు—

రాజ్యం—(ఏడుస్తూ) తీసుకోండి. మీవస్తువులు మీరు తీసుకోండి. నా కక్కర లేదు. (ఇచ్చును)

ప్రకా—(తెచ్చి యిచ్చి) ఇవి యే మాత్రం లెండి తమ వంటివారి కంటికి—తృణం.

దొంగ—నా జ్ఞాపకార్థం ఆవిడని ఈ జడబిళ్ల ఉంచుకోమనండి.

ప్రకా—చిత్తం. తమ జ్ఞాపకార్థం వేరే వస్తువెందుకండి—తమరే చాలు. తమర్ని ఈజన్మలో మరవగలమా అండి?

దొంగ—అలాగు కాదు. మరి ౪ రోజులు పోయిన తర్వాత మరో దొంగ మీయింటిమీద పడతాడనుకోండి. అప్పుడు మీరు నన్ను మెచ్చుకోవలె. ఇంతే నండి.

రాజ్య—చాలు చాలు. ఇంకా మాకొంప మీదికి దొంగల్ని తెచ్చి పెట్టకు.

ప్రకా—ఏమేవ్? ఊఁహూఁ! స్నేహం దగ్గర విరోధం తెచ్చేటట్లున్నావు. జాగ్రత.)

దొంగ—అయితే నాపని పూర్తి అయినట్లేనా?

ప్రకా—చిత్తం. ఇంకేముంది.

దొంగ—అదే అడుగుతున్నా (నవ్వుతూ) ఇంకేముందని?

రాజ్య—అదిగో ఆయన వున్నారు—కావలిస్తే తీసుకపొండి.

దొంగ—మంచిది వెళ్ళివస్తాను—నాకు తాంబూల మిప్పించివేయండి.

రాజ్యం—ఇంకా అదికూడా మిగిలిపోయిందా? (అసహ్యంతో కొరకొర చూచును)

ప్రకా—రా పిల్లా! చప్పున రెండాకులు చుట్టు.

రాజ్యం—నాచేత కాదు. అనుగో అకూ వక్కా యివ్వండి. చాలు.

ప్రకా—(మెల్లగా) ఆకూ వక్కా యిచ్చేస్తే వెంటనే వెళ్లిపోతాడు మరొక్క క్షణం కూర్చోపెట్టి బొతాఖానిలో పెడితే అప్పుడు నా తడాఖా తెలిపిస్తాను. (గట్టిగా) చుట్టు. బాగా చిలకలు చుట్టు.

రాజ్య—(తల వంచుకొని ఆకులు చుట్టుచుండును)

దొంగ—(కూర్చుండి) కానీండి. అయినా అలస్యంఏలాగూ కానే అయింది. (రిస్టువాచీ చూచి) ౧-౨౫. అబ్బా! (సిగరెట్టు కేసులోనుండి తీసి అతని కొకటిచ్చి తానొకటి పట్టి అగ్గిపుల్ల వెలిగించి తొలుత అతని కందించును)

రాజ్య—ఇదేమిటి? ఈ యాగేమిటి? చేసింది చాలక కొంప కగ్గి పెడుతున్నావా?

ప్రకా—దొంగగారూ (నేనూ) సిగరెట్లు కాల్చుకుంటూంటే మధ్య నీగగ్గోలేమిటి? నీపని నువ్వు చూసుకో.) చిత్తం చిత్తం. తమకు చాలా అలస్యమైపోయిందిక్కడ.

దొంగ—అయిపోయిం దండీ. ౧-౩౦. ఇంక మరోచోటుకు వెళ్లడానికి వేళ లేదు. ఓపిక కూడా లేదండి. అబ్బబ్బా! ౨౫ రోజు లయింది నిద్ర అన్నది లేనే లేదనుకోండి. శరీరం సుభ్రంగా చెడిపోయింది.

ప్రకా—వెధవది నైటు డ్యూటీ కష్టమే నండి.

రాజ్య—పాపం. ఎందు కింత కష్టపడిపోతున్నా వేమిటి?)

ప్రకా—నువ్వు నోరు మూసుకో—మగాళ్లం మేమూ మేమూ మాటాడుకొంటూ వుంటే పానకంలో పుడకలాగ మధ్య దూరుతావు—

దొంగ—మాటాడనివ్వండి—నేను వచ్చిన పని అయిపోయింది కనుక ఇంక నన్ను ఒక పరిచితుడుగాను స్నేహితుడుగాను మీరు భావించవచ్చును.

రాజ్య—అయితే అడుగుతాను—ఈపాడువృత్తి కాకుంటే ఇంతకంటే మంచివృత్తి మీ కేమీ కనబడ లేదూ?

దొంగ—ఎంచేత నమ్మా ఇది పాడువృత్తి అంటున్నావు?

రాజ్య—ఒకరి సొత్తు బలాత్కారంగా అపహరించడం పాపం కాదూ?

దొంగ—ఒకరి సొత్తేమిటమ్మా? తాను వచ్చేటప్పుడు తెచ్చాడా? పోయేటప్పుడు పట్టుక

పోతాడా? అది మనసొత్తైతేనే మన దగ్గరకు వస్తుంది. ఋణం లేందీ తృణమైనా ముట్టదంటారు. ఈవూళ్లో ఇందరు ధనవంతు లుండగా నే నిక్కడకే యెందుకు వచ్చాను? నా సొమ్ము ఇక్కడ వుంది గనుక.

రాజ్య—ఆఁ! నీయబ్బా నీతాతా గడించి ముల్లె యిక్కడ దాచపెట్టేడు.

ప్రకా—ఇదిగో చెపుతున్నా—నోరు మూసికో. తమరు సెలవిచ్చింది సత్యం.

దొంగ—ఈచుట్టుపట్ల మీకు తెలిసిన వాళ్లలో ఎక్కువగా నగదు వ్యాపారం చేస్తూ పిసరూ పిప్పీ బాగా వున్నవా ళ్లెవ ళ్లైనా వున్నారా?

ప్రకా—చిత్తం ఇక్కడికి ౮ మైళ్ల దూరంలో రాంపురంలో జయంతి వా రని వున్నారు. అర్ధరాత్రివేళ అయినా ౫-౬ సంచులు కావా లంటే అక్కడే దొరుకుతుంది.

రాజ్య—ఇక్కడి కింతటితో చాలు. మీ ధర్మమా అని వాళ్లకు కూడా కుడిపెట్టకండి.

ప్రకా—వాళ్లు మన అత్తవారు లెండి. పుట్టింటి అభిమానం కొద్దీ ఇది యీలాగు దేవులాడుతుంది. సత్యం చెప్పవలసివచ్చేటప్పుడు మనిషి తన పర అన్న భేదం చూపించకూడదు. ఏమండీ?

దొంగ—సరే రాసుకుంటా— రాంపురమా? ఇంటిపే రేమన్నారు;

రాజ్య—జోస్యులవారు.

దొంగ—(వ్రాసికొని) మీరు చెప్పినచోట నాకు దొరికే లాభంలో ౧౦౦ కి ౫ చొప్పున మీకు కమిష నిస్తాను.

ప్రకా—ఖేష్. అయితే నా నష్టం యిందులో కొంత కలిసివస్తుంది. పోయిన డబ్బు పోయింది గాని తమరు మాయింటికి దయచేయడం నిజంగా నా అదృష్టం. ఇంక నేను మీకింద కమిషన్ ఏజంటుగా పని చేస్తాను.

రాజ్య—ఇంక ఈయన కింద ఉద్యోగ మొక్కటీ తరవాయి. ఇదిగో తాంబూలం. ఇంక ఆయన్ని అంపకం పెట్టి రండి.

దొంగ—(తాంబూలం పుచ్చుకొని) అబ్బా తల రింగురింగు మని తిరిగిపోతున్నది. కాఫీ ఏస్పరిన్ గాని వుందా!

రాజ్య—ఏమిటీ హిరణ్యాక్షవరాలు? తెగూ తెంపూ లేకుండా వుంది—ఇది వుందా అది వుందా అని. ఇంట్లో యింకేమేమి మిగిలివున్నవో వరాసగా చెప్పివేస్తాను. తినవలసినవి తినేసి త్రాగవలసినవి త్రాగేసి పట్టుకపోవలసినవి పట్టుకపో. అటకమీద అరకాయ వుంది; కుండలో చద్ది అన్న ముంది—

ప్రకా—చాలు చాలు వూరుకో. దాని మాటల కే మండీ. వట్టి ఫిమేల్... కాఫీ ఏస్పరిన్ లేదు గాని థర్మోఫ్లాస్కులో తయారైన కాఫీ వుంది. ఓవల్‌టిన్ కావలిస్తే ౨ నిముషాల్లో స్టౌమీద తయారు చేయించేస్తాను.

రాజ్య—చేయించెస్తారు! నేను చేయను. కావలిస్తే మీరే చేసుకోండి.

ప్రకా—అన్నట్లు స్పిరిట్ లేదు కదూ!

రాజ్య—అది వుంటే యీప్రారబ్ధ మేమి?

దొంగ—శ్రమెందుకు లెండి— ఆకాఫీ యే అందుకోండి (త్రాగి తాంబూలం వేసుకొని) అబ్బా! లాభం లేదండి. మహా బాధగా వుంది. అమృతాంజనం వుందా?

ప్రకా—లేదు. నేను కొంచెం ఆయుర్వేద వైద్యుణ్ణి—ఒక్క మోతాదు మందిస్తాను పుచ్చుకోండి. (లోని కేగును)

రాజ్య—(కొంచెం దూరంగా నిల్చి) నీకింతటితో నైనా మమ్మల్ని అనుగ్రహించి విడిచిపోవాలనుంటే పో—ఇహ నైనా తలు పేసుకొని పండుకొంటాం. లేకుంటే నీకూ ఇక్కడ కొంపకోటు వేసేస్తాను—ఇద్దరూ కబుర్లు చెప్పుకుంటూ పండు

కోండి—అబ్బబ్బా! దొంగవాడుకూడా మాటల పోగూ బాతాఖానీరాయడూ అయితే మహా బాధ. (లోపల నుండి) రాజ్యం!

రాజ్య—ఆ వస్తున్నా (లోనికేగును)

దొంగ—(తలదించుకొనే) ఎవ్వరేమంటూన్నదీ నాకు తల కెక్కడం లేదు. మందు తెప్పించండి. (క్షణ మూరకుండి తల కొట్టుకొని బాధపడుతూ) ఏమండీ! నిద్రపోతున్నారా? ఇంకా తేరేం?

(తెత్తురు)

ప్రకా—ఇది కళ్లు మూసుకొని గుటుక్కున మింగేయండి—వెంటనే గుణ మిస్తుంది.

దొంగ—ఊహూ! మీరు కొంత బుచ్చుకోండి ముందు.

ప్రకా—ఇది ఒక్క మోతాదే నండి.

దొంగ—ఈమోతాదు మీరు ముందు బుచ్చేసుకోండి—తర్వాత నాకిత్తురు గాని.

ప్రకా—ఇదితలనొప్పి లేకుంటే వికటిస్తుందండి.

దొంగ—(ప్రకాశం చెయ్యి పట్టుకొని) నిజం చెప్పు—ఏమిటీ మందు?

ప్రకా—క్షమించాలి—నేను వద్దువద్దంటూ వుంటే నాభార్య బలవంతపెట్టి యీమందు కలిపించిందండి.

దొంగ—ఏమిటీ మందు?

ప్రకా—మరేం లేదు. మత్తుమందు. ఇది బుచ్చుకొంటే రేపీవేళకే తెలివి వస్తుంది.

దొంగ—ఛీఛీ. ఈలోకంలో నమ్మదగినవాడొక్కడు లేడు.

రాజ్యం—చాచా—లోకంలో నమ్మకస్తులెక్కడున్నారు—ఒక్క దొంగలు తప్ప.

దొంగ—ఇందాకా నీకు విడిచిపెట్టిన రూపాయిలిచ్చివేయి—నీ అపరాధానికి రూ ౧౫ లు జరిమానా.

(రాజ్య—నువ్వు నిజంగా జడ్జీలా గున్నావు కానీ దొంగలాగు లేవు.

ప్రకా—నువ్వు ప్లీడరులాగ లేవు? చాలుతే వూరుకో. (సా మ్మొచ్చును)

రాజ్య—నాప్లీడరీ మాట కేం గాని మీ రున్నారు నేరస్తుడు లాగు.

ప్రకా—ఇదే నండి అల్లర. అసలు హౌస్ బెండు అంటే గౌరవం లేదండి. నువ్వంటె నువ్వు.)

దొంగ—తలనొప్పి దుర్భరంగా వుంది. ఒక ఘంట నిద్రపోతే సర్దుకొంటుంది. పండుకొంటాను. ౧-౫౦. సరిగా 3 గంII కి నన్ను లేపివేయండి. ఎలారం టైంపీ సుందా?

రాజ్య—శ్రీరామచంద్రా! ఇది గంటల గొద్దీ ఆపరేషన్ లా గుంది—చిత్రకథ.

ప్రకా—(తెచ్చి) 3 గంIIలకు ఎలారం పెట్టనా?

దొంగ—పెట్టండి—ఇదిగో అంతవరకూ మీరూ మేలుకొని వుండండి.

ప్రకా—(ప్రక్క సర్దుతూ) మీరూ అంటే నేనొక్కడ నేనా? ఈమె కూడానా?

దొంగ—మీ రొక్కరే. (పండుకొని) మళ్లీ యీసారి యేమి ద్రోహం తలపెట్టినా చాలా చిక్కు పడిపోతా రన్న సంగతి నేను చెప్పకుండానే మీరు తెలుసుకోవలసి వుంది.

(క్షణం నిశ్శబ్దం)

రాజ్య—అయితే యీశివజాగరం మీకు తెల్లవార్లూ వుం దన్న మాటే!

ప్రకా—(మెల్లగా) మాటాడక మధ్య గదులోకి వెళ్ళి పండుకో.

రాజ్య—మీకంత సరదాగా వుంటే నాకేం కానివ్వండి—ఏమిటీ భాగవతం? వీడి వ్యవహారం చూస్తే ఇల్లరికం వుండిపోయే టట్లుంది.

ప్రకా—ఈయన ౨౦-వ శతాబ్దపు మనిషి.

రాజ్య—అంటే ?

ప్రకా— అంటే ఆడవాళ్లూ చదువులేని వాళ్లూ మీకేం తెలుస్తుంది? మంచి మంచి ఘరానా మనిషన్న మాట.

(రాజ్య—వీడెవడో నోవల్సులో దొంగలా గున్నాడు కాని—

ప్రకా—గట్టిగా మాట్లాడకు—నిద్ర పట్టినట్లుంది. నిజంగా ఈనోవల్సు వల్లా సినిమాల వల్లా దొంగతనం మోస్తరు మారిపోయి యెంత నాజూకుగా తేలిందో చూశావు?

రాజ్య—మోస్తరు మారితే నేం—ఫలితం వకటే. ౧౨౦౦ కి సుడిపెట్టేడు కదూ?

ప్రకా—మెల్లిగా—మెల్లిగా నిద్ర పట్టినట్టుంది.)

రాజ్య—ఇదిగో నా మాట విని—ఈలాగు రండి (దూరముగా గొనిపోవును)

ప్రకా—మరి చెప్పకు. నీ మాట నేను వినను—అది వినబట్టే యింతైంది.

రాజ్య—పోయిన ౧౨౦౦ కి లేందీ ఈ జరిమానా ౧౫ రూ॥లకేనా విచారం?

ప్రకా—లక్ష పోతే విచారం లేదు. కాని మగవాడన్న వాడికి ఒక కాణీ జరిమానా పడితే యెంత పరువు నష్టం!

రాజ్య—మగతన మడగక్కర లేదు. ఈలాటి మగవాళ్లుంటే రామసహాయం! పెట్రోలింగుకు వెళ్తారట! దొంగల్ని పడతారట. ఇదంతా ఒక సరదా ఆట కాని యింకేం కాదు. (మీరింత మనిషి వున్నారు—వీడు చూస్తే అర్భకుడు—టక్కున నిలబెట్టేస్తే?) కోమటి ఆచి పెట్టి ఓ లెంపకాయ కొట్ట లేకపోయినా డన్నారు—మీ రేంచాశారు. కొసకి గుంజీలు కూడా తీశారు సిగ్గు సిగ్గు.

ప్రకా—వేశాను. ప్లాను వేశాను. సమయం చిక్కనీ—ఏం చేస్తానో—

రాజ్య—మొదటనుంచీ అదే పాట పాడుతున్నారు కాని చెయ్యడమే కనబడదు. బాగా నిద్ర పట్టింది. నామాట విని ఇప్పుడు వీణ్ణి ఈమంచానికి కట్టివేయండి. మరి సిగ్గు నమలక లేండి సాహసించండి..

ప్రకా—సాహసం లేక కాదు. దొంగ యొక్క నిద్ర దొంగనిద్ర. మనమేమైనా తొందర పడితే ప్రమాదిస్తుంది.

రాజ్య—ఇంతకంటె యింకా ప్రమాద మేమిటి. కావలసిం దేమో కానే అయింది. దొంగా మనిషి వంటివాడే. వెచ్చగా కాఫీ త్రాగేడు—చల్లగా నిద్ర వచ్చింది. వాడికీ నిద్రాహారాలు కావలె. మనిద్దరం కట్టి ససవల మన్న సంగతి వాడికి బాగా తెలిసింది. హాయిగా నిర్భావచీగా పండుకొన్నాడు.

ప్రకా—ససవల మేమిటి—అసందర్భంగా మాట్లాడుతున్నావు?

రాజ్య—కాకుంటే మ ర్థేమిటి? గుంజీలు తియ్యమంటే గుంజీలు తీసేసి. జరిమానాలు కట్టమంటే జరిమానాలు కట్టివేసి. స్వాములవారికి సేవచేసినట్లు—అడుగులకు మడుగు లొత్తుతూ—చాచా మీరింత నాదారు మనుషు లనుకో లేదు నేను.

ప్రకా—ఈచాదస్తమంతా యెందుకు? అయితే యేం చెయ్య మన్నావు?

రాజ్య—నేను ముందర సాహసిస్తా చూడండి. (వాని దగ్గర నుండి బాకు తీసి) దొంగను చంపితే గవర్నమెంటు ప్రైజు టిస్తా రని చెప్పేరు—ఒక్క నరకు నరకండి.

ప్రకా—నువ్వే చూడలే నన్నావు?

రాజ్య—అప్పుడాలా గనిపించింది కాని—ఇప్పుడు చిత్రవధ చేసినా నాకు సంతోషమే. ఏం పాపం లేదు. మరి సిగ్గు నమలక నరకండి (బాకిచ్చును)

ప్రకా—(క్రింద పెట్టి) అమ్మో వద్దు వద్దు. నిద్ర పోతూన్నపుడు నరకకూడదు—లేస్తున్నాడు

రాజ్య—లేదు. ఇటునుంచి అట్టు తిరిగి పండు కొన్నాడు. పోనీ ఈతాడుతో (మంచానికి) కట్టివేయండి (తాడు తెచ్చి) ఈమాత్రం చేయలేరా?

ప్రకా—(ఆలోచించి) నే నొకటి చెప్తా—నువ్వు కట్టు. తెలిసింది. వాడు లేచి నిన్నేమైనా అంటే నేను మధ్య పడతాను.

రాజ్య—ఏం మగతన మండీ! ఏం మగతన మండీ! పోనీ పోతే నాప్రాణం కదా పోతుంది. (మంచాని కొక కొస కట్టి) నేను కడితే గట్టిగా వుండదు—వెంటనే వదుల్చేసికొంటాడు. మీరు కట్టండి—ఈమాత్రం చేస్తే తప్పు లేదు.

ప్రకా—ఈలాగు తే. (తాడు పుచ్చుకొని దొంగ గుండెలపై ఎత్తి వేయును)

దొంగ—(దిగ్గున లేచి) దగుల్బాజీ—దగుల్బాజీ!

ప్రకా—(గజగజ వణకిపోతూ) క్షమించాలి క్షమించాలి. (చప్పున పోయి భార్య రెక్క పట్టుకొని కొనివచ్చి) 'స్త్రీబుద్ధిః ప్రళయాంతకా' అని దీని మాట విని ఈఅపరాధం చేశాను. చుట్టుకొని తిరిగిపోతా వేం? నిలబడు.

దొంగ—(ఒక గ్రుద్దు రాజ్యానికి గుద్ది) ఏమి నీకిటువంటి పాడుబుద్ధి పుట్టింది?

రాజ్య—(ఏడుస్తూ) నీచేతులు పడిపోను. నువ్వు న్ను కొడతా వట్రా? నీకు తల్లిలేదూ? అక్కచెల్లెళ్లు లేరూ? పెళ్లాం లేదూ? వాళ్లనెవరైనా యీలాగు—

ప్రకా—నీ కంతే కావాలి. నోరు మూసుకో. ఇదివర పని చేయించి మళ్లా యేడుస్తావు!

రాజ్య—అమ్మ అమ్మ! ఏమిటీ ఘోరకలి? లోకంలో యింత చేతకానితనం కూడా వుంటుంది! మగవాడీమాత్రం కూడా పౌరుషం లేని సన్నాసి అయిపోతే ఇంక మొగుడనిమొద్దు అనీ పెళ్లనీ పెడాను అనీ ఎందుకీ తంతు అంతా?

ప్రకా—అయ్యో! ఊరుకుంటుందా ఓ చెంపకాయ కొట్టమందా. ఏమిటా పేలాపన?

దొంగ—(రాజ్యంతో) పో లోపలికి పో. ఇంక నువ్వు నోకంటి కగపడితే చూడు—పో.

రాజ్య—(ఏడుస్తూ లోనికి పోవును)

దొంగ—నువ్వు చేసిన నేరానికి ని న్నేమి చేస్తే తగిన శిక్ష అవుతుంది?

ప్రకా—నిలువుగా చీరేస్తే తప్పులేదు. ఇదుగో చెంపలు వేసుకొంటున్నా (వేసికొని) క్షమించండి. కావలిస్తే ౧౦ కాదు ౧౦౦ గుంజీలు తీసేస్తాను తీయబోవును)

దొంగ—గుంజీలు! గుంజీలు! నీకు ౧౦౦౦ రూ. జరిమానా వేశాను.

ప్రకా—అమ్మో అమ్మో! ఎక్కడ తెస్తును?

దొంగ—కొంప వున్నది గా—పత్రం రాయి.

ప్రకా—ఇంటిమీద ఇదివరకే అతేసరుగా అప్పున్నది.

దొంగ—బాకీటుతే (పుచ్చుకొని అది గుండెలపై పెట్టి) వ్రాస్తావా!

ప్రకా—రాస్తాను రాస్తాను. కాని ఇప్పుడు స్టాంపెక్కడనుంచి వస్తుంది?

దొంగ—నాదగ్గర వుంది. ఇంద కాగితం. కలం. ఇంకా మోసం చేస్తే ప్రాణానికే మోసం వొస్తుంది. జాగ్రతగా రాయి.

ప్రకా—(రాసి) ౧౯౩౮ అక్టోబరు నెల తే ౧౫ దిని విజయనగరం కాపురస్తుడు లేటు ద్వివేదుల చలమయ్యశాస్త్రిగారి కుమారుడు ద్వివేదుల ప్రకాశరావు. తర్వాత ఏం వ్రాయమన్నారు?

దొంగ—రాయి. కాంపురం కాపురస్తులు.

ప్రకా—కాంపురం! కాంపురం!

దొంగ—రాయి. జయంతి కృష్ణావధాని. గారి కుమారుడు జయంతి కుటుంబశాస్త్రి ఉరఫ్ మాస్టరు కట్టూ—రాయ వోయ్.

ప్రకా—(చూసి చూసి దిగ్గున లేచి)(అరె నీ సిగాతరగా)—నువ్వేన టోయ్, రాజ్యం! రావే రావే. మీయన్నే కుట్టుగాడు!

రాజ్యం—(నవ్వుతూ చప్పున వచ్చి) అవునా అన్నయ్యా. అయితే నువ్వేనా? బ్రతుకు దేవుడా! అయితే యీ వేష మంతా యేమిటి?

ప్రకా—అదే నేనూ అడుగుతున్నా—అయితే యీ పొయ్యి కాల మేమిటా! (ఒక్క గ్రుద్దు గ్రుద్ది) ప్రాణంపుచ్చుకొన్నావు. అయితేబొంబాయి యినుంచి యెప్పుడు వచ్చేవు? ముందు ఒక ఉత్తరం లేదు. పత్రం లేదు.

దొంగ—ఇదిగో పత్రం—రాయి రాయి.

ప్రకా—ఆ! రాస్తాను రూ౧౦౦౦లూ దొబ్బుక పోదు గాని (పత్రం చించి వేయును)

దొంగ—అవును అయినవాళ్ళ కిస్తావా—పరాయివాళ్లకు వేపుతావు కాని.

ప్రకా—సరే నీసంగ తేమిటి చెప్పు కూర్చోవే (ముగ్గురు మంచముపై కూర్చుందురు)

దొంగ—ఏముంది? ఇప్పుడు సాగర్ మువీటోనునుంచి—నియో ఇంపీరియల్ లోకి మార్చేసుకొన్నా. నీకా సంగతి పెండిసామాన్లు పంపినప్పుడు రాసేను గా!

ప్రకా—అవును—ఇప్పుడేం ఫిల్ము తీస్తున్నారు?

దొంగ—'కాలకోర్' అను ఫిల్ముషూటింగులో వుండగా 'డిరెక్టరు' చనిపోయినాడు. ౧౫ రోజులు సెలవు తీసుకొని యింటికి వచ్చేను. 3 రోజుల క్రిందట—ఓమారు మాచెల్లిని చూసి పోదా మని వచ్చేను (సాయంకాలం).

ప్రకా—అయితే ఆఫిల్ము తీస్తూ ఆడ్రస్సుతోనే వచ్చేశావా యేమిటి? లేకుంటే అది యిక్కడ ప్రాక్టీసు చేసుకోవలె ననుకొన్నావా?

దొంగ—లేదు లేదు. రావడమే మాచెల్లి చెప్పింది—దొంగల్ని పట్టడానికి నువ్వు ప్రతిరోజూ ప్రాక్టీసు చేసున్నావని— పెట్రోలిం గని రాత్రి తెల్లవార్లూ వూళ్లో తెగ—తిరుగు తున్నావని—అం టిదగ్గర కూడా అవే కబుర్లు చెప్తూ ప్రాణం పుచ్చుకొంటున్నావని—అది విని నీధైర్యసాహసా లేమిటో మా చెల్లిలికి చూపిస్తా మని—

ప్రకా—అంటే నీవేష మంతా దీనికి ముందే తెలుసు నన్న మాట! ఇద్దరూ కోడించుకొని చేసిందే యీ పనంతా! తిరి మీసాహాసం మండా!

రాజ్య—పెళ్లయిన యిన్నాళ్ళ కైనా మీధైర్య సాహసాలు నాకు తెలియవద్దా మరి. ఈయని అంధ్రా షెర్లాకుహూ మ్సట అన్నయ్యా—అంటే యేమిటి?

దొంగ—అంధ్రా అంటే ఇమిటేషన్ అన్న మాట అతర్వాత ఎంత గొప్ప పేరున్నా ఫర్వాలేదు. దాని శక్తిని ఇది ఆర్పేస్తుంది.

ప్రకా—మహంకాళీ! నీచాకచక్యం నిరుపమానం. ఒక్కచోట ఒక్కచోట తొణికేవు కావు గదా! ఆశ్చర్యం! నువ్వు చేసిం దంతా నట నైతే వీడికంటే నీవే పైచేయి. బావా! ఇది సంసారిగా కంటె సినిమా నటిగా బాగా రాణిస్తుంది. దీన్ని కూడా నీతో తీసుకపోయి యేసాగర్ లోనో త్రొక్కివేయ్.

దొంగ—నువ్వు కూడా రావా లోయ్—ఆ మహారాష్ట్రపు భోజనం ఏమీ సరిపడకుండా వుంది.

ప్రకా—(అట్టే చూచి) మాగొప్ప ఆట ఆడేసేవు కదూ. ఏదీ షేక్ హాండు ఈలాగు పారేయ్—(చేయి పట్టుకొని) హాల్లో, మాస్టర్ కుట్టూ!

దొంగ—(పంజా గట్టిగా నొక్కి) వెల్. అంధ్రా షెర్లాక్ హోమ్సు!

రాజ్య—ఆః! ఆః! వదలీ వదలీ—(ఇద్దరి చేతులూ పట్టి నవ్వుతూ విడిపించును)

అబ్బాయి నాన్న

మల్లాది రామకృష్ణశాస్త్రిగారు

'చెప్పండి...మరి!'

'ఏమిటి?'

'చందమామను చంద్రుణ్ణి, మామ అని ఎందుకు పిలవడం?'

'ఏమో'

'ఓస్... ఇంతేనా...'

'ఐతే, చెప్పనా..'

'ఆఁ...'

'నీవు ఒప్పుకుంటావా?'

'ముందు చెప్పండి. గెలవలేక...'

'నీలాటి చక్కని చుక్కలు కాంతు ల్లొండటం చేత'...

'సంతోషించారు తెలివికి, తమ రెవరో అప్పుడు...?'

'మేం... లక్ష్మీపుత్రులం!'

'ఓహో... అదా సంగతి! రోజూ తోటలో పూలన్నీ మాయ మాతూంటే... ఏమైపోతున్నాయా అనుకుంటున్నా. ఎవరి మీద ప్రయోగించడానికేం బాణసంచంతా?'

''ది కాదండి నాకు తెలుసులే. దేవిగారికి తలజార, దండలు అమరడం లేదని గునుపు'

'పోనీ తీసుకోండిమీ క్రాపింగు...లో...కి...'

'నవ్వు.. అలాగే...నవ్వితే నే నూరుకోను...'

'ఐతే కోపం తెప్పించుకుంటూ...ఇదుగో, బుంగమూతి పెడుతున్నా... వచ్చేసింది... ఊహ్ఁ...'

'ఇదిగో...ఓయ్! ...ఊ! ...పలకవూ? ఏమిటి నిజంగా కోపం వచ్చినట్లేనా? ఊహుఁ! అలా ఐతే నేను వప్పుకోను. అన్నింటికీ ఓమాదిరిగా నే తల ఊగిస్తే ఏలా? కోపం రాలేదా?. వచ్చిందా? వచ్చిందీ? సై. ఇక కాచుకో, చక్కిలిగింత పెట్టినా—నవ్వకూడదు—ఏం. సరేనా?'

* * * * *

'ఏమిటా కిచకిచలు?. ఇంకా మేలుకునే ఉన్నార్రా?!...

'..... ....'

'వినబడుతూనే ఉంది లే నవ్వు. మీరు మాట్లాడక పోయినా—'

'ఇక చాలించండి, ప్రొద్దు పోయింది. అమ్మాయి! ఇక పడుకో అమ్మా! ఓపలేని పిల్లవు. ఒళ్లు ఖారకిస్తుంది. వాడికేం లేం? అలవాటేగా తెల్లవార్లూ మేలుకోడం?'

* * * * *

'చెపుతే విననేర్పు లే దేం చేతునమ్మా? వాడు వాడే; అది అదే....ఇదుగోనర్రా! ఇక నే నూరుకోను'

'...మరే...అమ్మమ్మా...'

'కాదండీ...అమ్మమ్మగారూ...ఈయనే...'

'చూడవే...న...వ్వి...స్తూం....ది...నే...ను...'

* * * * *

'మీయిష్టం మీది నాయనా...ఉండండి, మెట్లగదిలోకి వెళ్లి పెద్ద మీట వేసేస్తా...దీపా లున్నంతవరకూ—'

* * * * *

'అమ్మమ్మా! వెన్నెల్లో నీమనుమరాలే...'

'ఊఁ! అఘోరించండి...మీయిల్లు బంగారం గానూ'

౨

'చూడండి...'

—మిమ్మల్నే...'

—అక్కడ కాదు...ఈలా రండి...'

—అబ్బ! రండి...ఇంతలో మరేం అరిగిపోరు...'

—ఓఁ! పిలిచిన కొద్దీ బిగింపు ఎక్కువౌ తూం దేం? మిమ్మల్ని ఎవరూ కొరుక్కు తినరు లెండి రద్దురూ...'

'....................

'ఎందుకూ?'

'...అలా చూడరేం. పాపపిలుస్తూన్నాడు...'

'ఆ...నీ అంత వాడే...తక్కువా ఏం?'

'కాదండీ...మీ అంతవాడు. మీ గుణా లన్నీ అప్పుడే అబ్బినాయ్. అనుక్షణం అనుసరించి ఉండాలి కదా....ఓస్! లేదమ్మ! మా నాన్న! మా బంగారు తండ్రి! నిన్ను కాదమ్మ! అబ్బ! ఎంతరోష మొచ్చిందో! ఒక్క మారు తీసుకోండి. ఏలా చేతులు చాస్తున్నాడో........'

—కే.ఆ.వు...కే...వు...కే...వుం...గాఆ...—

పోనీ లెండి. తెలియడం లా? వాడి భాషలో నెన్నెత్తుకోవు....నన్నెత్తుకోవు? ...అని....ఏలా పిలుస్తూన్నాడో...'

...ఇంత మాత్రం కవిత్వం నాకూ చేతనవు. నీవు పనికిరావు...అమ్మవు కావు...అంటున్నాడు సరేనా...'

'మహా నేర్చారు లెండి మాటలు...'

'మాట...'

'.................'

'పాపని...అమ్మమ్మకు యిచ్చి—'

—ఏం'

—వినిపించలా.?

—ఏమిటి?'

'నాకు తెలియదు బాబూ!. ఆవిడ కిస్తే వాదూరుకోడు...పని వేళప్పుడు—''

'అలా గైతే...'

'వాణ్ని చూడండి...ఊహుఁ అంటున్నాడు. వల్లకాదు...'

'ఊహు...నేను అంటా వల్లకాదని...'

'మీ అమ్మమ్మ దగ్గర పోయి కూర్చుంటా!!'

'అమ్మాయ్!...అదేమిటే? అలా మాటిమాటికీ తొట్టె కుదుపుతూంటే మళ్లా మేలుకుంటున్నాడు? అసలే కొంటె కోణంగి. పోనీ కాస్సేపు కాళ్లమీద వేసుకుని చిచ్చిగొట్టు...అంత ఎగరేయకు, ఉలికి పడతాడు...ఒక్క పావు గంట ఆడించు. నేను మడి విడిచి ఇవతలకు వచ్చి తీసుకుంటా—...'

* * * * *

'ఇంకా. పడుకోలా వాడు?'

'ఊహుఁ.ష్. బిగ్గరగా అనకండి...ఇప్పుడే కనుకుతున్నాడు. మళ్లా లేస్తే నన్ను వేపుకు తింటాడు...'

'వీడొకడు...దొరికాడు...'

'.....................'

'నిజంగానే. వెన్నెల రాత్రుల్లో...ఎంత హాయిగా ఉండేవాళ్లం? ఇప్పుడు—'

'ఆఁ...మీకు ఎప్పుడూ అదే రంధి...'

'అవును...నా ఆనందానికి—నా అనుభవానికి అడ్డం గొట్టడానికి పుట్టాడు. వీడు...'

'ఏమిటా మాటలు?—'

'ఏమిటా...నీతో మాట్లాడటానికైనా నాకు ఇప్పుడు 'స్వతంత్రం' లేదు. బిగ్గరగా పిలవకూడదు. అబ్బాయి ఉలికిపడతాడు. బిగ్గరగా నడవకూడదు. ఆయన మేలుకుంటాడు. నీవు నాతో కాస్సేపు తీరికగా ఉండకూడదు. ఆ మహారాజాధిరాజు పోరు మొదలెడుతాడు. ఐతే నేను, ఇక ఇంట్లోనూ ఉండకూడదు. అలా గైతే?'

'ఎక్కడ నేర్చుకున్నారు ఈ పాఠమంతా? మీకే ఉన్నారా మహా పిల్లలు? గాలికి తిరిగివచ్చి కబుర్లు చెప్పడానికే మీకు యింత కష్టమైతే అస్తమానం కనిపెట్టుకుని కూర్చునే దానికి నాకు ఏలా ఉంటుంది'...ఐనా మన పిల్లవాడికి మనం చేసుకోవడం అబ్బురమా? ఒకరికి మెప్పా? వాడు మాత్రం అందరి పిల్లల లాగా విసిగిస్తాడా?'

'వెనకవేసుక వస్తున్నావ్. అవును, నీకు వాడితోనే లోకం. నామాట—'

'ఆ...మీ మాట...మీరు చెప్పే మాట ఏమిటో నాకు తెలుసును. కొత్తా'

'ఊఁ...వీడిమూలానే నాకు నీవు దూరమౌతున్నావ్. ఐనావు. ఎందుకు పుట్టాలీ...వీడు?'

* * * *

'వింటున్నా మీ చిలకపలుకులు, మహా లక్షణంగా ఉన్నాయ్...'

'కాదే అమ్మమ్మా!...'

'చూడండి! వాళ్లె అబ్బాయితో యుద్ధం చేస్తున్నారు...'

'అవును...వాడు ఎందుకు పుట్టాలి...'

'అలాగేం? నాగన్నా! నీవు ఎందుకు పుట్టావు?'

'మా అమ్మ కన్నది...'

'మీ అమ్మ కంటే మాత్రం. నువ్వు ఎందుకు పుట్టడానికి ఒప్పుకున్నావూ? నిన్ను కాకపోతే ఇంకొకడ్ని కనేది. కడుపుతూన్నమ్మ కనక మానుతుందా? వండుకున్నమ్మ తినక మానుతుందా?... ఏం...'

'......................'

'జవాబు చెప్పవేం? ఇందాకన్నుంచీ, నోరులేని పసిక్కుంక వాడిమీద ఎగిరావ్. చెప్పు మరి?

* * * * *

'మీరూ...మీవేషాలూనూ. ఎత్తుకో. ఓమారు ఎత్తుకు తిప్పు. ఎందరు ఎత్తుకోందీ ఇంతవాడైనావ్? నేనూ, బతికుంటే చూడకపోతానుటే? వాడూ రేపు ఈ పాటికి బతికి బట్టకడితే వాడి పెళ్లాం దగ్గరా ఈలాగే ధిమాకులు చేస్తాడు. అప్పుడు మనవణ్ణి నీవే ఎత్తుకు మోయాలి. చాల్లే. ఇక ఈలాతే. ఈ నిమిషానికే పండుతండ్రిని పిసికేశావ్. ఈ కాలంవాళ్లకు...ఏదీ తెలియదు. అదేం లోకమో? పోన్లే నాయనా? నీవు నాదగ్గిరే పడుకుందువు కాని. మీ అమ్మనీ నాయన్ని గంతు లేసుకోమను. ఇనుగోనే అమ్మాయి...! నవ్వొస్తే ఆపుకోవాలి కాని—విరగబడుతూ, పరిగెత్తితే ఏలాగే? ఒక్కమారు వీణ్ణి తీసుకో...'

హిందీవల్ల తెనుక్కి జరుగుతూ వున్న అపకారం

ఈసంచికలో మంగిపూడి వేంకటశర్మగారి లేఖ ప్రకటిస్తామని చెప్పి వున్నాం. అయితే దొంగాటకమనే రూపకం అనుకున్నంత కంటే ౫ పేజీలు పెరిగిపోవడంవల్ల వీలయింది కాదు వచ్చేసంచికలో తప్పకుండా—మున్నంగి శర్మగారి లేఖకూడా ప్రకటిస్తాం. సంపాదకుడు

"గ్రుడ్డి ఆవేశంతో బయలుదేరిన కృతక దేశాభిమానంతో రాష్ట్రచింత నశింపజేసే స్థితిలోకి మనల్ని హిందీ తెచ్చే సరికి మీ శంఖధ్వానం నాలుగు దెసలా మారుమ్రోగింది. ఇందుకు మా అభినందనాలు. హిందీ మిషనరీలు క్రైస్తవమిషనరీల కన్న మనల్ని ప్రమాదస్థితిలోకి తేగలరు మీ రీ జెండా లేవనెత్తకపోతే" కొల్లూరి ధర్మారావు కవి బి ఏ

వ్యాఖ్యానములు

సత్యమూర్తిగారికే వోటు?

కాంగ్రెస్సు అసెంబ్లీలో ప్రవేశిస్తూ వుండంటే మాకేమీ ప్రసక్తి లేదు. ఆపక్షంలో యెవరు నెగ్గినా మాకు ఆక్షేపణలు కూడా లేవు; కాని కాంగ్రెస్సు మదరాసులో సత్యమూర్తిగారిని నిలిపింది. నిజంగా యిది మనమీద సవాలు!

మదరాసులో సగానికి పైగా మనవాళ్లున్నారు. మనలో వోటర్లు కూడా ఎక్కువే. మన వోటిచ్చి సత్యమూర్తిగారిని నెగ్గించడం అంటే మన వేలితో మన కన్ను పొడుచుకోవడం అన్నమాట. అసలు సత్యమూర్తిగారికి వోటు చేయడమే మనకి మనం పరాభవం చేసుకోవడం.

ఇలాంటి సందర్భంలో మరో జాతివాళ్లయితే యీ నిర్ణయాన్ని దృఢంగా ఆక్షేపించి వుందురు. మొన్నమొన్న — హైదరాబాదుకి సంబంధించిన కాంగ్రెస్సు వ్యవహారంలో వొక ఆంధ్రుడు కాంగ్రెస్సు ఆఫీసులో (జీతపు) సెక్రటరీగా వుండడాన్ని వామనరామచంద్రనాయకుగారు తీవ్రంగా ఆక్షేపించారు; కాని సత్యమూర్తిగారిని నిర్ణయించినందుకు మనవాళ్లేమీ మాట్లాడలేదు. పైగా మనవాళ్లే— మన ఆంధ్రపత్రికే సత్యమూర్తిగారికి జయం కలిగించాలని తాపత్రయం—చెప్పుకుంటే సిగ్గు.

సత్యమూర్తిగారి వాగ్ధాటీవల్లా, యెత్తులవల్లా ప్రజలలో తనమీద భక్తివిశ్వాసాలే ప్రబలుతాయో, నిరసనభావమే కలుగుతుందో చూసుకోవలసిన పూచీ కాంగ్రెస్సుదే; కాని సత్యమూర్తిగారు, అసెంబ్లీలోకి వెడితే ఆంధ్రజాతీయతకి తీరని అపకారం చేస్తారు. ఇది ముమ్మాటికీ నిశ్చయం. అసలు. వారి దీక్షే యిదీ.

ఆవెళ్లడంలోనూ తెనుగువారి సాయంవల్ల వెళ్లడం. ధిక్!

ఇంతకీ: సత్యమూర్తిగారు మనకి చేసే అపకారం యేమిటంటే? దానికి వారిదివరకే పునాదులు వేశారు. మొన్నటి ఏప్రిలులో బరంపురంలో జరిగిన ఓఢ్రయువజనుల రెండో సమావేశపు కార్యక్రమం వొకమాటు చూస్తే యీ సంగతి బాగా బోధపడుతుంది.

అసలు శ్వేతపత్రమే కొంత తెనుగుభూభాగాన్ని ఓఢ్రరాష్ట్రంలో కలుపుతోంది. ఇలాంటి సందర్భంలో శ్వేతపత్రంలో సూచించబడ్డ సరిహద్దులతో ఓఢ్రరాష్ట్రం లాభకరం కాదని, అందులో చేర్చబడని జయపురం, పర్లాకిమిడిపట్టణం తత్సంస్థానం, మాళువాలు, మందసా, టెక్కలి జలంత్రా, బుడారిసింగి, సింగుభూము, ఫుల్ జార మొదలయిన స్థలాలన్నీ ఓఢ్రరాష్ట్రంలో కలిపించుకుని తీరాలని సత్యమూర్తిగారు ఓఢ్రయువజనులకు పురెక్కించారు. ఈమాటలతో వారు అసభలో తీర్మానాన్ని నెగ్గించారు అసలా తీర్మానాన్ని సత్యమూర్తిగారే ప్రతిపాదించారు కూడను.

ఏవంగుణవిశేషవిశిష్టులయిన సత్యమూర్తిగారికి మనవాళ్లు ఓటు చెయవలసిందేనా?

మన ప్రముఖులు కాంగ్రెస్సులో చేరి త్యాగం చేస్తున్నారంటే "అది యేమిటి చెప్మా?" అనుకున్నాం. ఇప్పుడు బోధపడింది

ఇప్పటికీ, యెప్పటికీ, కూడా

"మీకు చేతనైతే యెదట నిలవబడండి. మేము హిందీప్రచారం మానం. ఇంకా అధికంగా కూడా చేస్తాం. మాకు వెనకాల పెద్ద ఆసరా— పెద్ద పెద్ద జీతాలిచ్చే ఏర్పాటులున్నాయి. జటిలమైన

ార్యక్రమం వుంది. మీ రాతల వల్ల మా హిందీ
ప్రచారాని కేమీ అడ్డు రాదు" హిందీప్రచారం
చేస్తూ వున్న ఆంధ్రసోదరు లిలా సవాల్ చేస్తు
న్నారు.

ఈ సవాలుకి మేము హృదయపూర్వకంగా స్వాగతం యిస్తున్నాము.

అయితే: మే మిప్పు డెవరికీ జీతా లివ్వడం లేదు. ఇవ్వ లేము; కాని మాకూ కార్యక్రమం వుంది.

సామాన్యభాషకోసం మనం యిప్పు డింత హైరా నయిపోవడం యెంత అనవసరమో, హిందీ వల్ల తెనుక్కి యెంత అపకారం జరుగుతోందో, ధిలో నిలబడివుండవలసిన హిందీ తెనుగులోగిళ్ల లోకి చొరబడరావడం తెనుగువారి కెంత సిగ్గుల చేటో, తెనుగువారే యెలాగ తెనుగుమీద దండె త్తుతున్నారో బోధపరిచి, తెనుగువారిలో కొందరి నేనా మాతృభాషారక్షణకోసం పరభాషల నెది రించే టంతటి అభిమానవంతులు గానూ, శూరులు గానూ, ధీరులు గానూ, నిజమైన తెనుగుతనం కల వారిని గానూ తయారు చేసుకోవడమే యిప్పటికి మా కార్యక్రమం.

మా శక్తికొద్దీ దీన్నే మే మిప్పు డాచరణలో పెడుతున్నాం.

అయితే: సాగినా సాగకపోయినా హిందూస్థా నీలు వచ్చి తెనుగుని చంపేసి, తెనుగు యిళ్లల్లో తమ హిందీని ప్రవేశపెట్టడానికి ప్రయత్నించడం లో కొంత అర్థం వుంది. వారి నెదుర్కోడానికి కూడా మేము నిశ్చింతగానూ, నిష్కర్ష గానూ సిద్ధపడగలం; కాని వారి విరాళాలవల్లా, వారి పర్య వేక్షణం కిందా సంహారకార్యక్రమం అమలులో పెడుతూ వున్న సంస్థలో జీతాలు తింటూ తెనుగు మీద దండెత్తే తెనుగువారినే మే మిప్పు డెదుర్కో వలసివచ్చింది.

దీన్ని బట్టి తెనుగు జాతి యిప్పు డెలాంటి స్థితిలో వుందో, ఇలాంటి పరిస్థితుల్లో కార్యసాఫల్యం దాకా అక్కర్లేదు, జనానుమోదాన్ని పొందడం యెంత కష్టమో, యిది యెంత దౌర్భాగ్యస్థితో హిందీప్రచారకులు కొంచెం యోచించవలసి వుంది.

కాని, మా మీద వా రిలాగే నిశ్చింతగా సవాలు చేస్తూ వుండవచ్చు. తమకి గల వెనక ఆస రాని వారు పూర్తిగానే వినియోగపరుచుకోవచ్చు. వారిని మే మేమీ ఆక్షేపించం.

ఏ జీతమూ, నాతమూ లేని సినేటు, సిండికేటు సభ్యులే తెనుగులో విద్యావిధానం యేర్పరిస్తే దేశం ధ్వంసం అయిపోతుం దని, జాతి అజ్ఞానాం ధకారంలో కూలిపోతుం దని, గోల చేసే టప్పుడు బోలె డేసి జీతాలు పుచ్చుకునే యీ హిందీ ప్రచా రకులు ఇలాగ సవాల్ చెయ్యడంలో వింత యేమీ లేదు.

మంచిదే. ఈ పోరాటంలో ఇప్పటికీ ఎప్పటికీ గూడా మేము కటిబద్ధులమే. మా మాతృభాష మీద విరుచుకు పడే ఆపత్తు నెదుర్కోవడంలో యేమి తలస్థపడినా మా కానందమే.

మిగిలిపోవు, రెట్టింపు తెలుస్తాయి

".........అయితే ఈ గ్రంథాలను పాఠశాలలలో ప్రవేశం కలిగించవలసిం దనే వారిలో నేను చేరను. ఏమంటే ? ఈ భాష సులభమే; కనుక గురు వుల బోధతో దీనికి అవసరం వుండదు. విద్యార్థి దశ కాస్తా దీని పఠనంతో సరిపోతే గురుశుశ్రూష చేసి తెలిసికొనే విషయాలు మిగిలిపోతాయి. కాబట్టి గ్రాంథికభాషనే వాడుక చేయడమ్మొక్కటీ అవసరం........"

కృష్ణాపత్రిక (౬-౧౦-౩౪)

పాఠ్యగ్రంథాలు గ్రాంథికంలోనే వుండాలని ప్రతిపాదిస్తూ శతావధాని చెళ్లపళ్లి వేంకటశాస్త్రిగా రిలా అన్నారు

ఏవిషయంలో నేనా సరే గ్రంథాలు రాయతగ్గది గ్రాంథికమా, వ్యావహారికమా అనే తగువు చాలా రోజుల కిందటే తేలిపోయింది. ఇప్పుడు వ్యావహారికంలోనే అనేకగ్రంథాలు ప్రకటించబడుతున్నాయి. 'మాలపల్లి' వంటి ఉద్గ్రంథాలు పాఠశాలలలోనే కాదు, కళాశాలలలోకూడా నిరాఘాటంగా ప్రవేశిస్తున్నాయి. ఇది యిలా వుండగా, మొదట గ్రాంథికమే అని పాకులాడినవా రనేకు లిప్పుడు వ్యావహారికంలోకి బదిలీ అయిపోతున్నారు. పైగా వ్యావహారికంలో రచన సాగించినవా రెవరూ గ్రాంథికంలోకి దిగిపోవడం లేదు. కనక యిప్పుడు వ్యావహారికాన్ని కించపరచ పోతే సాగేదీ లేదు, గ్రాంథికాన్ని గొప్ప చెయ్యపోతే వొరిగేదీ లేదు.

ఇక వున్న దల్లా యేమి టంటే?

వ్యావహారికం సులభమే; కాని దాన్లో వున్నది సౌలభ్యం వొక్కటే కాదు. అందులో జీవం వుంది. హృదయాన్ని తాకించే శక్తి వుంది. యుగయుగాల నుంచి సంచితం అవుతూ వుండే జాతీయత వుంది. రసానుభవం కలిగించే రీతి వుంది. అంచేత విషయం గంభీర మయిన కొద్దీ వ్యావహారికమున్నూ జటిలం అవుతూనే వుంటుంది. తరగతుల వరసని విద్యార్థికి భాషాపరిచయం క్రమాభివృద్ధి పొందుతూనే వుంటుంది; కాని గ్రంథకర్త యొక్క పాండిత్యాన్ని పట్టి గురువు బోధించవలసిన మెళుకువలు వ్యావహారికంలో అనేకా లుంటూనే వుంటాయి.

ఇంతే కాకుండా, గ్రాంథికం బోధించినకొద్దీ శిష్యుడి బుద్ధి గమడగొయ్యి అయిపోతుంది. అసలు గురువునే అడుగకుక్కే సంశయాలు పిక్కుటింటూ వుంటాయి.

వ్యావహారికం బోధిస్తూ వుంటే గురువుబుద్ధి పండు వెన్నెల లాగా, పిల్లగాలి లాగా ప్రసన్న భావం తాలుస్తూ వుంటుంది. శిష్యుడి బుద్ధి గులాబీ పువ్వులాగ వికసిస్తూ, గుబాళిస్తూ వుంటుంది.

కనక, వ్యావహారికానికి గురువుల బోధతో అవసరం వుండదనడానికి వీలు లేదు.

ఇక విషయాల సంగతి. ఈసందర్భంలో వేంకటశాస్త్రిగా రింకో మాటు ఆలోచిస్తే బాగుంటుంది ఏమంటే? విషయం కోసం భాష.; కాని భాష కోసం విషయం కాదు. ఇంతే కాక: విద్యార్థికి ప్రధాన మైనది విషయపరిజ్ఞానం; కాని భాషా పాండిత్యం కాదు. అసలు సూదితో దారం వచ్చేటట్టు విషయంతో భాష వస్తూనే వుంటుంది. కాగా, వ్యావహారికం సులభమే; కనక, విద్యార్థికి భాషకోసం గడపవలసిన కాలం కూడా విషయబోధకే వినియోగపడుతుంది. అంటే, భాష కఠిన మయినప్పుడు తెలిసే విషయాల కంటే భాష సులభ మయినప్పుడు రెట్టింపు విషయాలు తెలుస్తాయి. ఇది మంచిదే కాదూ? కావలసిందే కాదూ? విద్యావిధానంలో ఆవశ్యమూ అవలంబించవలసిన పద్ధతే కాదూ?

నమ్మండి. చివరికి వుర్దూ

హిందూదేశానికి సామాన్యభాష హిందీ అనీ, దానికి లిపి దేవనాగరి అని కాంగ్రెస్సు చెబుతోంది. దక్షిణ భారతదేశంలో దీన్ని గురించి బ్రహ్మాండ మైనంత ప్రచారం జరుగుతోంది. మన ఆంధ్రులు కొందరు హిందీ తమ సొంత భాష అన్నంత ఆవేశంతో ఆప్రచారంలో పాల్గొంటున్నారు.

కాని మాహమ్మదీయులు ఈహిందీనీ, దేవనాగరిలిపినీ అంగీకరించడం లేదు "వారు వుర్దూభాషని సామాన్యభాషగా వాడా లనీ; దానికి లిపిగా పార్శీ వాడా లనీ, చెబుతున్నారు.

దక్షిణభారతదేశీయులకు మాహమ్మదీయుల ఈప్రతిఘటనం తెలకదు.

కాని యిది జాగ్రత్తగా ఆలోచించ తగ్గ విషయం. "హిందూదేశానికి సామాన్యభాష యేదీ?"

అనే తగు వింకా పరిష్కారం కాలేదు. ఇది తీవ్ర రూపం తాల్చే రోజులు ముందే వున్నాయి.

నిజానికి వుర్దూ మాట్లాడేవారికంటె హిందీ మాట్లాడేవారే యెక్కువ వున్నారు; కాని ఉత్తర దేశం అంతటా—హిందీ యెక్కడ పుట్టిందో, యెక్కడ వాడుకలో వుందో, యెక్కడనుంచి మన తెనుగుదేశంమీదకి వురకలు వేసుకుంటూ వస్తోందో అక్కడ కూడా కోర్టుభాష వుర్దూ కాని, హిందీ కాదు.

దొరతనంవారు సైన్యానికి సంబంధించిన వ్యవహారాల్లో వాడేది కూడా వుర్దూ కాని హిందీ కాదు.

ఇది యిలా వుండగా: మాటిమాటికీ— ప్రసక్తి వచ్చినప్పుడల్లా—సందర్భం కానప్పుడు కూడా దక్షిణభారతదేశీయులకు "హిందీ నేర్చుకోండి" అని నిక్కచ్చిగా హితబోధ చేస్తూ వున్న గాంధిగారు కాంగ్రెస్సులోనుంచి వెళ్ళిపోతూ వెళ్ళిపోతూ, కాంగ్రెస్సు సభ్యతను కోరే దరఖాస్తులలో హిందీలో గాని వుర్దూలోగాని సంతకాలు చెయ్యాలని శాసించారు. మొన్న బొంబాయిలో జరిగిన కాంగ్రెస్సులో కొందరు వుర్దూలో సంతకం చెయ్యడం నేర్చుకున్నారుట కూడానూ.

ఏం?

అసలు, భాషికరాష్ట్రసిద్ధాంతాన్ని అంగీకరించి ఆచరణలో పెడుతోం దన్న కాంగ్రెస్సు ప్రాంతీయభాషలలో కాక అన్నిప్రాంతాలవారినీ హిందీలో సంతకాలు చెయ్యమనడమే స్వవచనవ్యాఘాతం. అందులోనూ వుర్దూలో కూడా సంతకాలు చెయ్యవచ్చు ననడం మరీ తప్పు.

దీనివల్ల గాంధిగారు కూడా మాహమ్మదీయుల ప్రతిఘటనాన్ని ఎదురుకో లేకపోయారని స్పష్టమే.

హిందీముగ్ధుల కిది మంచి గుణపాఠం. ఎరగనేస్చుకుంటే హిందీకోసం ఖర్చుపెట్టే డబ్బూ, గడిపే కాలమూ అంతా బూడిదలో పోసిన పన్నీరయి పోతుం దని వారికి వేరే చెప్పనక్కర లేదు.

ఇంకొకటి కూడా వారు గ్రహించవలసి వుంది. ఏమి టంటే? సామాన్యభాషను గురించి మాహమ్మదీయులు ఏమీ శ్రద్ధ చెయ్యడం లేదంటే యేమన్నమాట? ప్రస్తుతం సామాన్యభాషగా చెలామణీ అవుతూ వున్న ఇంగ్లీషుని తప్పించేసి ఆస్థానంలో మరోభాషని ప్రవేశపెట్టడానికి ముందు సంపాదించుకోవలసిన హక్కులు చాలా వున్నాయి. వాటికి సాధనంగా బలపరచుకోవలసిన—గడించుకోవలసిన యోగ్యత చాలా వుంది.

కచ్చితంగా చెప్పండి

హిందీ మనకి 'సామాన్యభాష' అని కొందరూ, 'జాతీయభాష' అని కొందరూ అంటున్నారు. ఈరెండింటికీ అర్థంలోనూ, వినియోగంలోనూ చాలా భేదం వుంది. ఇది కాక: దక్షిణభారతహిందీ ప్రచారసభవారూ, హిందీమహావిద్యాలయంవారూ, వారికి ఆజ్ఞలు సాయించీవారూ, వారి ననుసరించీ వారూ చేస్తూ వున్న ప్రచారం చూస్తే వారందరి వుద్దేశమూ దక్షిణదేశభాషలను చంపేసి, వాటి స్థానంలో పూర్తిగా హిందీని ప్రవేశపెట్టడంగా స్పష్టంగా కనపడుతోంది. అవునా కాదా? ఈవిషయం ప్రజలకి స్పష్టంగా తెలవాలి.

ఈ సంగతి తేలాలంటే దక్షిణభారతహిందీ ప్రచారసభవారూ, హిందీమహావిద్యాలయంవారూ ఈక్రింది ప్రశ్నలకు కచ్చితంగా జవాబులు చెప్పాలి. వారు దేశభాషలవిషయంలో తమకి దుశ్చింత లేదని మాత్రమే అంటే చాలదు.

స్వరాజ్యం వచ్చాక

౧. హిందూదేశాన్ని భాషికరాష్ట్రాలుగా విభజించడం వారి కార్యక్రమంలో వుందా లేదా?

౨. అలా విభజించినప్పుడు ఆయా రాష్ట్రాల శాసనసభలలోనూ, సకల న్యాయస్థానాలలోనూ, కార్యస్థానాలలోనూ, సకలవ్యవహారాలూ ఆయా రాష్ట్రాల భాషలలోనే జరపాలా, హిందీలో జరపాలా?

౩. ఆయా రాష్ట్రాలలో ప్రాథమికపాఠశాలలు మొదలు కళాశాలలవరకూ— విశ్వకళాపరిషత్తులలో కూడా విద్యావిధానమూ, వ్యవహారమూ అంతా ఆయా రాష్ట్రాల భాషలలోనే జరపాలా హిందీలోనా ?

౪. మన విద్యావిధానంలో ఇంగ్లీషుకి స్థానం వుండాలా అక్కర లేదా? వుంటే ఏ తరగతి మొదలుకుని ?

౫. స్కూలుఫయినలులో తప్ప మరే కింది తరగతిలోనూ హిందీని ప్రవేశపెట్టకుండా వుంటారు కాదూ ?

౬. స్కూలుఫయినలు మొదలు పైతరగతులలోనేనా కేవలమూ వ్యవహారం నడిపించుకోడానికి తగినంత మాత్రమే తప్ప సాహిత్యం కోసమూ, పుస్తకాలు రాయడానికీ, పత్రికలు నడపడానికీ, అవసరం అయేటంత హిందీని నేర్పే విధానం యేర్పరచరు కాదూ ?

౭. సామాన్యభాషని వాడవలసిన సమయాలు ఆయా రాష్ట్రాల వారికి ఇతరరాష్ట్రాల వారితో సంబంధం కలిగినప్పుడే తటస్థిస్తాయి కాదూ ?

౮. ఆయా రాష్ట్రాలవారు తమలో తమకి పని కలిగినప్పుడు రాతలలోనూ, సంభాషణలలోనూ, వినోదాలలోనూ—సకలసందర్భాలయందూ మాతృభాషని తప్ప మరో భాషని వాడడం దేశద్రోహమూ, మాతృద్రోహమూ అనిపించుకుంటాయి కాదూ !

౯. సామాన్యభాషయొక్క ప్రయోజనం కేంద్ర ప్రభుత్వంలోనూ, కేంద్రశాసనసభలోనూ, కేంద్ర న్యాయస్థానంలోనూ, భిన్నభాషలు వాడుకలో వుండే పట్నాల—నగరాల బజారులలోనూ మాత్రమే కాదూ ?

౧౦. ఆయా రాష్ట్రాల ప్రభుత్వవ్యవహారాలకూ, ప్రజలవ్యవహారాలకూ సంబంధించిన యావత్తు కాగితాలూ కేంద్రప్రభుత్వానికీ, కేంద్రశాసనసభకీ, కేంద్రన్యాయస్థానానికీ పంపవలసివస్తే వాటిని సామాన్యభాషలోకి అనువదించి మాత్రమే పంపాలి కాదూ ?

౧౧. ఆయా రాష్ట్రాలవారు—అంటే హిందూస్థానీలు తప్ప తతిమ్మా అన్ని రాష్ట్రాలవారూ కేంద్రప్రభుత్వనిర్వహణానికి సంబంధించినంతవరకే గాని తక్కిన హిందీవాఙ్మయానికి ఏవిధమైన పోషణా చెయ్యవలసిన పని లేదు కాదూ ?

౧౨. ఇతరరాష్ట్రాల ప్రభుత్వాలతోనూ, కేంద్ర ప్రభుత్వంతోనూ అధికారరీత్యా ఉత్తరప్రత్యుత్తరాలు జరపవలసిన పూచీగల ఉద్యోగులకు తప్ప తతిమ్మా యేవుద్యోగులకీ హిందీలో పాండిత్యం వుండవలసిన నిర్బంధం లేదు కాదూ ?

౧౩. హిందీటాకీలవల్ల ఆయా రాష్ట్రాల భాషల టాకీలకీ, హిందీగ్రామోఫోను ప్లేట్లవల్ల ఆయా రాష్ట్రాల భాషల ప్లేట్లకీ నష్టం రాకుండా వుండేటంత బిగువుగా నిబంధనలు చెయ్యాలి కాదూ ?

౧౪. పైని పేర్కొన్న రెండు సభలవారూ నడిపే విద్యావిధానంలో హిందీలో సాహిత్యజ్ఞానం కలగడానికే; కాని వ్యవహారజ్ఞానం కలగడానికి తగిన పాఠ్యక్రమం యేమీ లేదు కాదూ ?

౧౫. ఇప్పుడు ఇంగ్లీషుని విడిచిపెట్టి హిందీతో నెరవేర్చుకోతగిన పను లేమీ లేవు కాదూ !

౧౬. హిందీని పైకి తెచ్చిన కాంగ్రెస్సులో కూడా ఇప్పుడు హిందీకి తగిన స్థానం లేదు కాదూ?

౧౭. తెనుగు గ్రంథకర్తలు నిరుత్సాహపడిపోతూవుండగా, తెనుగు గ్రంథప్రకాశకులు దిగనారిపోతూవుండగా తెనుగు గ్రంథాలయాలు హిందీగ్రంథాలతో నిండిపోతూ వుండడం దౌర్భాగ్యానికి సూచన కాదూ ?

౧౮. తమ మాతృభాష హీనస్థితిలో వుండగా దాన్ని స్మరించక ప్రలోభనాలకు లోబడి హిందీ ప్రచారం చెయ్యడమే కాకుండా తెనుగు యువకులు మాతృభాషాసేవకులమీద సవాళ్లు చెయ్యడం అసభ్యం కాదూ ?